بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

22 ఆగష్టు 2024 క్రీ, శ. 22 జహూర్ 1403 హి, శ.
15 సఫర్ 1446 హి,ఖ.

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

సంపుటి: 9
సంచిక : 34
వార్షిక చందా 600/-రూ॥

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

اِنَّ الَّذِیۡنَ اٰمَنُوۡا ثُمَّ کَفَرُوۡا ثُمَّ اٰمَنُوۡا ثُمَّ کَفَرُوۡا ثُمَّ ازۡدَادُوۡا کُفۡرًا لَّمۡ یَکُنِ اللّٰہُ لِیَغۡفِرَ لَہُمۡ وَلَا لِیَہۡدِیَہُمۡ سَبِیۡلًا ○(النساء:138)

**అనువాదం:** ముందు విశ్వసించి తరువాత విశ్వాసరహితులై, తిరిగి విశ్వసించి, మరల విశ్వాస రహితులై, విశ్వాసరాహిత్యమును పెంపొందించుకొను వారిని నిశ్చయముగా అల్లాహ్ ఎన్నడు క్షమించడు. వారికి సరియైన మార్గము చూపడు. **(నిసా: 138)**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*.

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

**పరస్పరం ప్రేమాభిమానాలను, సోదర భాంధవ్యాలను పెంచుకోండి. విద్వేషాలను, కఠినత్వాలను విడనాడండి. అన్ని రకాల హేళనలు, హేవగింపుల నుండి పూర్తిగా దూరం ఉండండి. ఎందుకనగా హేళన స్వభావం మానవుని మనస్సును సత్యం నుండి దూరం చేస్తుంది. ఎక్కడి నుండో మరెక్కడికో చేరవేస్తుంది.**

## హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

వాస్తవ విషయమేమనగా అల్లాహ్ తాను కోరుకున్నట్లుగా చేయగలడు. ఎడారులను నగరాలుగా, పెద్ద పెద్ద నగరాలను ఎడారులుగా మార్చగలడు. బాబిల్ నగరాన్ని ఏమి చేశాడు?. ఆ నగరాన్ని సుప్రసిద్ధ నగరంగా తీర్చిదిద్దాలని ప్రజలు ప్రణాళికలు రచించారు, కాని ఆ నగరం పాడుపడి పోయింది. ఆ ప్రాంతాన్ని గుడ్లగూబలు తమ నివాసాలుగా మార్చుకున్నాయి. కాని మానవుడు ఏ ప్రాంతాన్ని అయితే ఎడారిగానే చూడాలనుకున్నాడో ఆ ప్రాంతాన్ని ప్రపంచీకులందరి కేంద్ర బింధువుగా మార్చినాడు. కావున బాగా గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, సాధనాలు, ప్రణాళికలను నమ్ముకొని అల్లాహ్‌ను వదిలివేయడం మూర్ఖత్వం అనబడుతుంది. పూర్తిగా పునర్జీవనం పొందునటువంటి జీవితాన్ని ఆశించాలి. ఎక్కువగా అస్తఘ్‌ఫారుల్ చేయాలి. ఎవరైతే అత్యధిక కార్యకలాపాలను నిర్వహిస్తుంటారో వారే ఎక్కువగా భయపడు తుండాలి. ఉద్యోగస్తులే ఎక్కువ ధార్మిక విధుల ఆచరణను కోల్పుతుంటారు. కొన్ని సందర్భాలలోనే జొహర్‌తో పాటు అసర్‌ను మరియు మఘ్‌రిబ్‌తో పాటు ఇషాను కలిపి చదువు కోవడం సమంజసం అవుతుంది. తమ ఉన్నతాధికారులను నమాజ్ కొరకు సమయాన్ని అడిగినచో వారు తప్పకుండా అనుమతిస్తారని నాకు బాగా తెలుసు. ఉన్నతాధికారులు తమ క్రింది స్థాయి అధికారులకు కూడ ఇందుకై ఆదేశాలు జారి చేస్తారు. తమ విశ్వాస బలహీనతల వలనే ప్రజలు సాకులు చూపుతూ నమాజ్‌లను వదిలి వేయడం జరుగుతుంది తప్ప మరొకటి కాదు. దేవుని హక్కులను మరియు దేవుని దాసుల హక్కులను చెల్లించు విషయంలో దౌర్జన్యానికి పాల్పడకూడదు.

రోజులు చాలా భయంకరముగా ఉన్నాయి. దేవుని ఆగ్రహానికి అందరు భయపడుతూ ఉండాలి. అల్లాహ్ తాలా తన స్వచ్ఛమైన దాసులను తప్ప మరెవరిని పట్టించుకోడు. పరస్పరం ప్రేమాభిమానాలను, సోదర భాంధవ్యాలను పెంచుకోండి. విద్వేషాలను, కఠినత్వాలను విడనాడండి. అన్ని రకాల హేళనలు, హేవగింపుల నుండి పూర్తిగా దూరం ఉండండి. ఎందుకనగా హేళన స్వభావం మానవుని మనస్సును సత్యం నుండి దూరం చేస్తుంది. ఎక్కడి నుండో మరెక్కడికో చేరవేస్తుంది. పరస్పరం ఒకరు మరొకరితో గౌరవంగా వ్యవహరించండి. ప్రతి ఒక్కరు తమ సౌకర్యాలకంటే తమ సోదరుల సౌకర్యాలకే ప్రాధాన్యత ఇవ్వండి. అల్లాహ్ తాలాతో నిజాయితితో కూడిన సంధిని కుదుర్చుకోండి. అతని విధేయతను స్వీకరించుటకు తిరిగి రండి. దైవాగ్రహానికి భూమండలం గురి అవుతున్నది. సంపూర్ణ స్థాయిలో తమ పాపములన్నింటి నుండి ప్రాయశ్చిత్తం చేసుకొని అతని సన్నిధిలో మోకరిల్లువారు మాత్రమే కాపాడబడుతారు.

**(మల్ఫూజాత్ సంపుటి 1, పేజి 241-243, ప్రచురణ ఖాదియాన్ 2018)**

**తమ జాతికే చెందిన ఒక వ్యక్తిపై దైవవాణి ఏ విధముగా అవతరిస్తుంది అని అవిశ్వాసులు ఆశ్యర్యపోతుంటారు....ముసల్మానులలో అధికుల పరిస్థితి కూడ నేడు ఈ విధముగానే ఉన్నది. హజ్రత్ ఈసా (అ)యే ఆకాశం నుండి దిగి వచ్చి తమను క్షీణతలు మరియు ఓటమిల నుండి కాపాడుతాడు. అంతేగాని తమను సంస్కరించు వ్యక్తి తమలో జన్మించడని ముసల్మానులు ఎంతో నమ్మకంగా చెబుతుంటారు.**

సయ్యిదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్‌హు యూనున్ అధ్యాయానికి చెందిన 4వ సూక్తి **అకాన లిన్నాసి అజబన్ అన్ అవ్‌హైనా ఇలా రజులిన్ మిన్‌హుం......**ను విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు.

తమ జాతికే చెందిన ఒక వ్యక్తిపై దైవవాణి ఏ విధముగా అవతరిస్తుంది అని అవిశ్వాసులు ఆశ్యర్యపోతుంటారు. తమ జాతిలో గొప్పవ్యక్తి జన్మించడు అనే భావన అణగారిన జాతులలో ఎల్లప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. ఒక విధముగా చూసినచో అవిశ్వాసులు తమ దుస్థితిని చూసి “తమ దుస్థితికి తగిన సంస్కరణ తమలోనే ఉన్నదని నమ్మడానికే సానుకూలంగా లేనంతగా'' వారు నిరాశ నిస్పృహలకు గురైనారు. తమను వృద్ధి చేయుటకు, తమను సంస్కరించుటకు, తమను ప్రగతి పథంలో నడిపించుటకు ఇతర జాతి నుండి మరొకరు రావలసిందే అని ఆలోచించేవారు. ముసల్మానులలో అధికుల పరిస్థితి కూడ నేడు ఈ విధముగానే ఉన్నది. హజ్రత్ ఈసా (అ)యే ఆకాశం నుండి దిగి వచ్చి తమను క్షీణతలు మరియు ఓటమిల నుండి కాపాడుతాడుగాని, తమను సంస్కరించు వ్యక్తి మాత్రం తమలో జన్మించడని ముసల్మానులు ఎంతో నమ్మకంగా చెబుతుంటారు. ఈ విషయంలో ముసల్మానులకు పూర్వపు జాతులతో ఎంతటి పోలిక ఉన్నదో చూడండి. అదే నిరాశ, అదే సంస్కరణ విధానం.

తమ జాతి అభ్యున్నతి విషయమై ఏ ఆశాజనకమును కల్గియుండని లేదా ఇతర జాతి వ్యక్తిలేకుండా సంస్కరణయే సాధ్యం కాదని భావించే ప్రజలకు, వారిలో నుండే వారి సోదరుడు ముందుకు వచ్చి నేను మిమ్ములను సంస్కరిస్తాను, మీ అభ్యున్నతి కొరకు పాటుపడుతాను అని ప్రకటన ద్వార తెల్పినచో వారి ఆశ్చర్యానికి హద్దులే ఉండవు. అంతేగాకా అసాధ్యమని భావించిన అంశాన్ని సాధ్యం చేసి చూపుతానని అతడు ఎలా ప్రకటన చేశాడు అని అభ్యంతరంను వెల్లడిస్తూనే ఉంటారు.

వారిని ఇంకా ఆశ్చర్యమునకు గురి చేయునట్టి రెండవ విషయమేమనగా “ ప్రజలను హెచ్చిరించుము అని నాకు ఆజ్ఞాపించడమైనది'' అని ఆ వాగ్దాత ప్రకటన చేయడం. అనగా కొన్ని పురాతన విధానాలను వీడి, మరికొన్ని నూతన విధానాలను అనుసరించాలి అని చెప్పడం. అలాంటి ప్రజలకు ఇలాంటి ప్రకటనలు ఎప్పుడు ఆశ్చర్యకరంగానే ఉంటాయి.

**(9వ పేజిలో చదువుము)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ జహ్‌ని రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హుదేబియా రోజు ఉదయం వర్షం పడిన తరువాత మాకు ఫజర్ నమాజ్‌ను చదివించారు. ఆ వర్షం రాత్రి నుండే కురువడం మొదలైనది. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ చదివించిన తరువాత ప్రజలను ఉద్దేశిస్తూ “మీ అల్లాహ్ చెప్పిన విషయం మీకు ఏమైనా తెలుసునా?” అని అడిగారు. అందుకు అనుచరులు “ అల్లాహ్ మరియు అతని ప్రవక్తకే బాగా తెలుసు ” అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హుజూర్ (స) ఇలా తెలిపారు. “ఈ రోజు ఉదయం నా దాసులలో కొందరు నా విశ్వాసులుగా మిగిలారు, మరి కొందరు నాకు అవిశ్వాసులుగా మారిపోయారు. అనగా ఎవరైతే అల్లాహ్ తాలా దయ మరియు కరుణ వలనే మాపై వర్షం కురిసింది అని పలికారో వారు నా విశ్వాసులు మరియు గ్రహ ఫలాల తిరస్కరులు. ఎవరైతే ఫలాన ఫలాన గ్రహం ఫలాన ఫలాన చోటుకు రావడం వలన మాపై వర్షం కురిసింది అని పలికారో వారు నా తిరస్కరులు మరియు గ్రహాలపై విశ్వాసం గలవారు ” అని అల్లాహ్ తాలా తెలిపాడు.

హజ్రత్ ఇబ్నే ఉమర్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. భవిష్య గోప్యతలకు చెందిన ఐదు కీలకాంశాలు గలవు. వాటిని గూర్చి, వాటి తాళం చేవిలను గూర్చి కేవలం అల్లాహ్‌కే బాగుగా తెలుసు. అవి: ఒకరి జీవితంలో ఎన్ని ఒడి దొడుకులు ఉంటాయో ఎవరికి ఖచ్చితముగా తెలియదు. అదే విధముగా ఎవరికి ఎలాంటి వారు జన్మిస్తారో ఎవరికి ఖచ్చితముగా తెలియదు. చివరి అంకంలో ఎవరి అంతిమ ఫలం ఎలా ఉంటుందో ఎవరికి తెలియదు. ఎవరు ఏ ప్రాంతంలో మరణిస్తారో ఎవరికి తెలియదు. వర్షం ఎప్పుడు కురుస్తుందో కూడ ఎవరికి ఖచ్చితముగా తెలియదు.

**(సహి బుఖారి, కితాబుల్ ఇస్తస్ఖా, ప్రచురణ ఖాదియాన్ 2006)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విలపించు వారి ప్రార్థనలకు సమాధాన మిస్తానని పేర్కొన్నాడు. కావున విలపించుట అనగా కేవలం కలవరపడిన వ్యక్తియే కాదు. ప్రతి మార్గం మూసివేయబడిన వ్యక్తి కూడ విలపించు పరదిలోకే వచ్చును. కాబట్టి, మనము ప్రార్థించుటకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు మోకరిల్లినప్పుడు, మనలో ఈ స్థితిని పెంపొందించుకొని, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఈ విధముగా వేడుకోవాలి, “నీవు తప్ప మాకు ఎవరూ లేరు. మేము నీపై మాత్రమే ఆధారపడి ఉన్నాను. నిన్నే మేము నమ్ముతాము. నీ వద్దకే వచ్చాము”

మన వేదన యొక్క స్థితి ఎలా ఉండాలనగా, ప్రపంచంలోని మార్గాలన్నీ మూసుకుపోయాయని మనం వంద శాతం నిశ్చయించుకొని, ఇప్పుడు ఒకే ఒక మార్గం ఉంది, అది దేవుని మార్గం, మన పశ్చాత్తాపాన్ని అంగీకరించే వ్యక్తి మార్గం, అతడే మనలను మన కష్టాలనుండి బయటికి తీయగలడు అని విశ్వసించడం. అలా మనం మన ప్రార్థనలలో ఇటువంటి బాధాకరమైన స్థితిని సృష్టించుకోవాలి.

“ఓ మా ప్రభువు!, మాపై సర్వక్షమాశక్తిని కురిపించుము. మరియు యుద్ధ రంగమున మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము. అవిశ్వాసులకు వ్యతిరేకముగా మాకు సహాయంను అందించుము. ” మరో మాటలో చెప్పాలంటే, ఎలాంటి భయంలోగాని, ఎలాంటి పరిస్థితులలో గాని మా అడుగులను తడబడకుండా చూడుము.

“ఓ అల్లాహ్, నేను సమాధి శిక్ష నుండి నీ శరణు కోరుకుంటున్నాను. మరియు మసీహుద్దజ్జాల్ నుండి నేను నీ శరణు కోరుకుంటున్నాను. మరల నేను జీవితం మరియు మరణం యొక్క పరీక్షల విపత్తుల నుండి నీ శరణు కోరుకుంటున్నాను. ఓ అల్లాహ్! నేను పాపంల నుండి మరియు అప్పుల నుండి కూడ నీ అభయాన్ని కోరుకుంటున్నాను.

ఓ అల్లాహ్!, నీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరిన మంచిని మేము నీ నుండి కోరుకుంటున్నాము. నీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నీ శరణు కోరిన ప్రతి చెడు నుండి మేము నీ శరణు కోరుతున్నాము. నీవు నిజమైన సహాయకుడివి. మేము నిన్ను మాత్రమే ప్రార్థిస్తాము. అల్లాహ్ సహాయం లేకుండా, మాకు సత్కార్యములను చేయు స్థోమతగాని లేదా సాతాను దాడుల నుండి రక్షించుకునే శక్తిగాని లేదు .”

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు మనస్ఫూర్తిగా దుఆలు చేసే అవకాశాన్ని ప్రసాదించుగాకా!. తమ స్వంత భాషలలో కూడా దుఆలు చేయాలి. నిండు మనస్సుతో, నిజమైన తపనతో, నమ్మకంతో దుఆలు చేయుభాగ్యము లభించుగాకా!. రంజాన్ శుభములు మనకు శాశ్వతంగా ఉండేలా దుఆలు చేయండి. ఈ శుక్రవారం మరియు తదుపరి అన్ని శుక్రవారాల శుభములను కూడ మనం పొందువారము కావలెను.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 05 ఏప్రిల్ 2024, (05 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

**అమ్మన్ య్యుజీబుల్ ముజ్‌తర్ర ఇజా దఆఉ వ యక్‌షిఫు స్సూఅ వ యజ్‌అలుకుం ఖులఫాఅల్ అర్‌జి అ ఇలాహున్ మ్మఅల్లాహి ఖలీలన్ మ్మా తజక్కరూన్**

లేదా, విలపించుచు పిలుచువాని ప్రార్థనను స్వీకరించి, బాధను నివారించు వాడెవడు?. మిమ్మల్ని భూమిపై వారసులుగా చేయువాడెవడు?. అల్లాహ్‌తో పాటు మరో దేవుడు ఉన్నాడా? మీరు ఉపదేశం పొందినది చాలా తక్కువ.”

**(అన్నమల్: 63)**

విలపించుచు మరియు బాధతో చేయు ప్రార్థనలకు నేను సమాధానము ఇస్తానని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ సూక్తిలో పేర్కొన్నాడు. గత జుమా ప్రసంగంలో కూడ నేను ప్రార్థన అనే అంశంపై హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశాల వెలుగులో ఒక వ్యక్తి ఎలా ప్రార్థించాలి?, ప్రార్థనల వాస్తవికత ఏమిటి?, వాటి తత్వం ఏమిటి? అనే ఆంశాలను గురించి ప్రస్తావించాను. నేను ఈ రోజు కూడా ప్రార్థన యొక్క అదే అంశాన్ని కొనసాగిస్తాను. నేను చెప్పినట్లుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విలపించు వారి ప్రార్థనలకు సమాధాన మిస్తానని పేర్కొన్నాడు. కావున విలపించుట అనగా కేవలం కలవరపడిన వ్యక్తియే కాదు. ప్రతి మార్గం మూసివేయబడిన వ్యక్తి కూడ విలపించు పరదిలోకే వచ్చును. కాబట్టి, మనము ప్రార్థించుటకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు మోకరిల్లినప్పుడు, మనలో ఈ స్థితిని పెంపొందించుకొని, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఈ విధముగా వేడుకోవాలి, “నీవు తప్ప మాకు ఎవరూ లేరు. మేము నీపై మాత్రమే ఆధారపడి ఉన్నాను. నిన్నే మేము నమ్ముతాము. నీ వద్దకే వచ్చాము”

జమాఅత్ పరంగా చూసినచో మనం గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, అల్లాహ్ తప్ప మరెవరు కూడ మనలను ఈ పరిస్థితుల నుండి గట్టెక్కించే వారు లేరు. అనగా పాకిస్తాన్‌లో గాని లేదా ఇతర దేశాలలో నెలకొన్న పరిస్థితులు గాని. నిజానికి వ్యక్తిగత విషయాలలో చూసిన కూడ అల్లాహ్ తాలాయే అన్ని పనులను చేయును అని అర్థమవుతుంది. మన అవసరాలను తీర్చేవాడు అతడే, మోకరిల్లబడుటకు కూడ అర్హుడు అతడే అని నమ్మాలి. అతడే మార్గాన్ని సమకూరుస్తాడు, అతని ముందు మోకరిల్లని వారు కూడా ఆయన దయానుగ్రహాల నుండి ప్రయోజనంను పొందుతారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పిన విలపించు వారి యొక్క ప్రత్యేక విశిష్టతను గూర్చి నేను గత జుమా ప్రసంగంలోనే ప్రస్తావించాను. కలవరపడు వారి దుఆలను ఆలకిస్తాను అని అల్లాహ్ తాలా తన నిర్దిష్ట సంకేతాన్ని ప్రస్తావించాడు.

అందువల్ల, తమ ప్రార్థనలలో కలవరపడు స్థితిని అభివృద్ధి చేసూకోవాలి. మరియు ప్రార్థనల పట్ల మనం చాలా శ్రద్ధ వహించాలి, ఎందుకంటే మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల నుండి మనలను బయటకు తీసుకువెళ్లేది ప్రార్థనలు మాత్రమే. వాస్తవానికి, ముస్లిం సమాజంను ఈ విపత్తుల నుండి బయటికి తీసుకవచ్చునది కూడ దుఆయే. ఒకవేళ ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోని ప్రజలు దుఆ చేయవలెను. అల్లాహ్ యొక్క అవతార పురుషుడిని వ్యతిరేకించడం కూడ వదిలివేయాలి.

ఏదిఏమైనప్పటికీ, అహ్మదీయుల విషయానికొస్తే, ప్రతి అహ్మదీ తమ మనస్సులలో ఈ వాస్తవాన్ని క్షుణ్ణంగా పొందుపరచాలి, వారు తమ ప్రార్థనలకు సమాధానం పొందాలనుకుంటే, వారు ఆవేదన మరియు కలవరపడు స్థితిని అభివృద్ధి చేసుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ ఆంశాన్ని గూర్చి మరొక చోట ఈ విధముగా తెలిపారు. “సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంభువు. కావున ఎక్కువగా మరియు పదే పదే విలపిస్తూ దుఆలు చేయనంత వరకు అతడు

ఎవరిని పట్టించుకోడు." మరల ఇలా తెలిపారు. " ......దుఆలు ఆమోదించ బడుటకు కలవరపడు స్థితి ఒక నిబంధన అని తెలుసుకోవాలి. "

**(మల్ఫూజాత్ సంపుటి 10, పేజి 137, ముద్రణ 1984)**

మన వేదన యొక్క స్థితి ఎలా ఉండాలనగా, ప్రపంచంలోని మార్గాలన్నీ మూసుకుపోయాయని మనం వంద శాతం నిశ్చయించుకొని, ఇప్పుడు ఒకే ఒక మార్గం ఉంది, అది దేవుని మార్గం, మన పశ్చాత్తాపాన్ని అంగీకరించే వ్యక్తి మార్గం, అతడే మనలను మన కష్టాలనుండి బయటికి తీయగలడు అని విశ్వసించడం. అలా మనం మన ప్రార్థనలలో ఇటువంటి బాధాకరమైన స్థితిని సృష్టించుకోవాలి. అలా కాకుండా ఈ దుఆలు, దైవస్మరణ కేవలం నోటి ఉచ్ఛరణలకే పరిమితం చేస్తే, వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. దీని గురించి, ఒక సందర్భంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. "అల్లాహ్‌ను అధికముగా స్మరించుకోవాలని నేను మీకు ఆజ్ఞాపిస్తున్నాను. ఈ దైవస్మరణ ఉదాహరణ " ఒక వ్యక్తిని అతని శత్రువులు వేగంగా వెంబడిస్తున్నారు. ఫలితముగా ఆ వ్యక్తి పరుగెత్తి సురక్షితమైన కోటలో ఆశ్రయం పొంది, తన శత్రువుల బంధనం నుండి రక్షించబడినాడు" కు అనుగుణంగా ఉండవలెను. ఈ విధంగానే మానవజాతి సాతాను నుండి విముక్తి పొందవచ్చు, అలా కానిచో వేరే మార్గం లేనేలేదు.

**(షఅబుల్ ఈమాన్, భాగం 2, పేజ 73, హదీస్ 534, ప్రచురణ మక్తబతు రుషద్ నాషరూన్ బేహరూత్ 2003)**

కాబట్టి ప్రార్థనల వైపు ఎక్కువ శ్రద్ధ చూపవలసిన అవసరం ఉన్నది.

పవిత్ర ఖురాన్ దుఆలు ఉన్నాయి, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దుఆలు ఉన్నాయి, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు నేర్పించిన దుఆలు ఉన్నాయి, ప్రతి ఒక్కరు స్వంత భాషలో కూడా చేసుకునే దుఆలు ఉన్నాయి. మన చుట్టూ మనం ఎదుర్కొంటున్న పరిస్థితుల నుండి లేదా సృష్టించబడుతున్న పరిస్థితుల నుండి మనల్ని మనం రక్షించుకోవాలనుకుంటే మనం వీటిపై చాలా శ్రద్ధ వహించాలి. పాకిస్తాన్‌లో మరియు కొన్ని ఇతర దేశాలలో మనం స్వేచ్ఛగా నమాజ్‌లు చేసుకోలేము. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల మనకు ఉన్నటు వంటి ప్రేమను స్వేచ్ఛగా వ్యక్తపరచలేము. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క చివరి ధర్మశాస్త్రమైన పవిత్ర ఖురాన్‌ను కూడ మనం స్వేచ్ఛగా చదవలేము. ఇస్లామిక్ ఏ పద్ధతిని మరియు ఆచారాలను మనం స్వేచ్ఛగా మరియు బహిరంగంగా వ్యక్తపరచలేము. సాతాను చెంచాలు ఎల్లప్పుడు అవకాశం కోసం ఎదురు చూస్తుంటూనే ఉంటాయి. ఈ క్రమంలోనే అహ్మదీలకు వ్యతిరేకంగా కార్యక్రమాలను నిర్వహించుటకు ఎప్పుడు అవకాశం దొరుకుతుంది అని ఒకరు మరొకరితో పోటి పడుతూ, తమకు తాముగా గొప్ప పుణ్యకార్యములు తలపెట్టు చున్నామని భావిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం, ఒక అహ్మదీయుడిని హత్య చేశారు. హంతకులను పట్టుకున్నారు. వారిని ప్రశ్నించినప్పుడు వారు " మేము ఫలాన మదర్సాకు చెందిన మౌల్వీ గారిని స్వర్గంలోకి ప్రవేశించడానికి సులభమైన మార్గం ఏమిటి అని అడిగాము. అందుకు అతడు "అత్యంత సులువైన మార్గం అవిశ్వాసులను చంపడం. అహ్మదీలు అవిశ్వాసులు కాబట్టి, వారిని చంపడం మరియు హత్య చేయడం చట్టబద్ధమే" అని చెప్పాడు. అని సమాధానం ఇచ్చారు. వాస్తవానికి, వారు తమ స్వంత చర్యల ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆగ్రహాన్ని ఆహ్వానిస్తున్నారు.

మొత్తానికి మనం మన స్థితులను విలపించు స్థితులుగా మార్చుకోవలసిన అవసరం ఉన్నది. విలపించు వారి సంకేతంను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పవిత్ర ఖురాన్ వెలుగులో ఈ విధంగా వివరించారు. " ముజ్‌తర్ " అనే పదం యొక్క అర్థమేమనగా, మానవుడు కేవలం పరీక్షించబడునప్పుడు మాత్రమే తీవ్రమైన బాధలకు గురి చేయబడడం. అంతేగాని శిక్షించబడునప్పుడు బాధింపబడడం ఏమాత్రం కాదు.

**(దాఫీ'-ఉల్-బాలా, రూహాని ఖజాయిన్ , సంపుటి 18, పేజి. 231)**

ఈ రోజు, అహ్మదీయులు మాత్రమే అలాంటి పరీక్షలను ఎదుర్కొంటున్నారు, వారిపై ఈ ఆంక్షలు విధించబడ్డాయి, వారు తమ దేవుని ప్రేమను మరియు పవిత్ర ప్రవక్త పట్ల గల ప్రేమను కూడా వ్యక్తపరచలేని పరిస్థితి. ఇవి స్వార్థపూరిత కోరికలు కాదు, లేదా శిక్షింపబడే నేరాలు కావు, అయినా మనం ఈ పరీక్షలను ఎదుర్కొంటున్నాము. కావున ఈ రోజుల్లో మరియు ఎల్లప్పటికీ, మనం దుఆలలో మరియు భగవంతుని స్మరణలో నిమగ్నమై ఉండాలి. మనం దైవ సన్నిధిలో మోకరిల్లు నప్పుడు మరియు దుఆలు చేయునప్పుడు ఇట్టి కలవరపు స్థితిని ఏర్పర్చుకోవాలి. ఈ రోజు, నేను పవిత్ర ఖురాన్, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కొన్ని దుఆలను ప్రస్తావిస్తాను. ఆ దుఆకు ఇక్కడ కేవలం "అమీన్" అని పలికితే సరిపోదు. మనం ఈ దుఆలను నిరంతరం చేస్తూనే ఉండాలి. వాటిని అర్థం చేసుకుంటూ, మనస్సులో ఉన్న బాధను వ్యక్తపరుస్తూ ఉండాలి. ఇవియే కాకుండా, మన స్వంత భాషలలో కూడా దుఆలు చేస్తుండాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ తమ స్వంత భాషలలో ప్రార్థించాలని పేర్కొన్నారు, అప్పుడే ఆందోళనకరమైన స్థితి ఏర్పడుతుంది. మనస్సు కూడ ప్రభావితం చెందుతుంది.

**(మాల్ఫుజాత్, సంపుటి 6, పేజి 146, ముద్రణ 1984)**

దైవ స్మరణ చేయువారిని గురించి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: "దైవస్మరణ చేసేవారి ఉదాహరణ మరియు చేయనివారి ఉదాహరణ జీవించి ఉన్నవారితో మరియు చనిపోయినవారితో సమానం."

**(సహీహ్ అల్-బుఖారీ, కితాబ్ అద్-దావత్, బాబ్ ఫజల్ జికురుల్లాహి అజ్జవజల్లా హదీస్ 6407)**

కావున ఎల్లప్పుడు దైవస్మరణలో లీనమై ఉన్నటు వంటి, అట్టి సజీవులలో పరిగణింపబడుటకు మనం ప్రయత్నించవలెను. మరొక సందర్భంలో, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:

"దుఆ ఇప్పటికే ఎదుర్కొంటున్న కష్టాల నుండి మోక్షాన్ని కల్పించడానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది మరియు భవిష్యత్తులో ఎదుర్కొనవలసిన కష్టాల నుండి కూడ మిమ్మల్ని రక్షిస్తుంది. కావున, ఓ అల్లాహ్ సేవకులారా, మీపైన ప్రార్థనను తప్పనిసరి చేసుకో

**(సునన్ తిర్మిజి, అబ్వాబ్ అద్దావత్, బాబ్ మన్ ఫతహులహు మిన్‌కుం బాబుద్దువా హదీస్ 3548)**

కాబట్టి, ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. నేను చెప్పినట్లుగా, నేను కొన్ని ప్రార్థనలను ప్రస్తావిస్తాను, వాటిలో మొదటిది సూరా అల్-ఫాతిహా. మనం ఈ సూరాను రోజువారీ నమాజ్‌లలో మాత్రమే కాకుండా, మనం ఇతర సమయాల్లో కూడా పఠించాలి. ఖిలాఫత్ జూబ్లీ దుఆలలో కూడ దీనిని చేర్చడం జరిగింది. సూరా ఫాతిహాను కూడ ప్రజలు పఠించేవారు. మానవుడు వీటిని నిరంతరం పారాయణం చేయడంను అలవాటు చేసుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సందర్భంలో, సూరా అల్-ఫాతిహా యొక్క ప్రత్యేక విశిష్టతను గూర్చి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "శ్రద్ధతో మరియు చిత్తశుద్ధితో దీనిని పారాయణం చేయడం వలన మనస్సును శుద్ధి చేస్తుంది, చీకటి పొరలను పారద్రోలుతుంది" ఇది హృదయాన్ని చీకటిగా మార్చే ఆ పొరలను తొలగిస్తుంది. "మరియు మనస్సును విస్తరింపజేస్తుంది." ఇది ఓపెన్ మైండెడ్‌ను ప్రసాదిస్తుంది మరియు ఓదార్పునిస్తుంది. "మరియు, సత్యాన్వేషకులను అల్లాహ్ వైపు ఆకర్షిస్తుంది. దైవజనులకు లభించునట్టి తేజస్సులు మరియు స్పష్టమైన సంకేతాలతో సత్కరిస్తుంది. " సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు దగ్గరగా చేరుస్తుంది. ఒకవేళ మానవుడు శ్రద్ధతో, అర్థం చేసుకుంటూ పఠించినచో దైవజనులకు లభించునట్టి సామిప్యత లభిస్తుంది. ఆ సామిపత్య మనకు లభించదని కాదు. "వాటిని మానవుడు ఇతర విధానాలతో లేదా వ్యూహాలతో ఎన్నడు సాధించలేడు."

**(బరాహీన్-ఎ-అహ్మదియా, భాగం 4, రూహాని ఖజాయిన్ సంపుటి 1, పేజి. 402)**

ఈ విధంగా, సూరహ్ ఫాతిహాను శ్రద్ధతో మరియు పదేపదే చదవడం ద్వారా, ఒక వ్యక్తి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు దగ్గరవుతాడు. నిజానికి ఆ సూరాను శ్రద్ధతో పఠించినచో దానిలోని నేర్పించబడిన దుఆలే మానవునిలో ఆవేదన యొక్క స్థితిని సృష్టిస్తాయి.

మరల పవిత్ర ఖురాన్‌లోని మరొక దుఆ ఇలా ఉంది:

**రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతన్ వ్వఫిల్ ఆఖిరతి హసనతన్ వ్వఖినా అజాబన్నార్ (బఖర:202)**

"ఓ మా ప్రభూ!, మాకు ఇహలోకంలో కూడ మంచిని ప్రసాదించుము. పరలోకంలో కూడ మంచిని ప్రసాదించుము మరియు నరకపు బాధ నుండి మమ్మల్ని రక్షించుము."

ఈ దుఆను గురించి, ఒక సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు: "విశ్వాసి యొక్క ప్రాపంచిక అనుబంధాలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో, వారు అంతటి ఉన్నత స్థానాల్లో ముందుకు సాగుతారు, ఎందుకంటే వారి ప్రధాన లక్ష్యం ధర్మమే అవుతుంది." ఒక విశ్వాసి యొక్క ప్రధాన లక్ష్యం ధార్మమే కాబట్టి, అల్లాహ్ దృష్టిలో కూడ అతని ప్రాపంచిక అనుబంధాలన్నియు ఉన్నత పదవులను కల్పిస్తాయి. ఎందుకనగా, అతను తన విశ్వాసానికి ప్రాధాన్యత ఇస్తాడు. "మరియు ప్రపంచం దాని సంపద మరియు గౌరవం అన్నియు ధార్మిక సేవకులుగా మారిపోతాయి. అందువల్ల, ప్రాథమిక అంశం ఏమిటంటే, ప్రపంచ సాధన ఒకరి లక్ష్యం కాకూడదు. వాస్తవానికి, ధార్మికతనే ప్రధానం చేసుకొని ప్రాపంచిక వ్యవహారాలను అనుసరించాలి".

మరల ఇలా తెలిపారు. " ప్రాపంచికతయే లక్ష్యముగా కాకుండా ధార్మికతనే ప్రధానం చేసుకొని ప్రాపంచికతను సాధించవలెను. అది ధార్మిక సేవకుడిగా మారిపోవునట్లుగా ప్రాపంచికతను సాధించవలెను." మరల ఇలా తెలిపారు.

"......మహోన్నతుడైన అల్లాహ్ మనకు ఈ క్రింది దుఆను నేర్పించాడు: **రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతన్ వ్వఫిల్ ఆఖిరతి హసనతన్ వ్వఖినా అజాబన్నార్ (బఖర:202)**. ఇందులో ప్రాపంచికతకు ప్రాధాన్యతనివ్వడం జరిగింది. " అనగా ప్రపంచాన్ని ముందుగా ప్రస్తావించడం జరిగింది. "కాని ఎలాంటి ప్రపంచాన్ని?. ...... పరలోకములో మంచిని పొందే సాధనంగా మారునట్టి ప్రపంచం. " పరలోకములలో మనకు మంచిని చేకూర్చునట్టి ప్రాపంచికానికి ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. " ఈ దుఆలో మనకు బోధించబడిన వాస్తవమేమనగా, ఒక విశ్వాసి పరలోకం యొక్క మంచిని దృష్టి యందుంచుకొని ప్రపంచాన్ని సాధించాలి. మరియుఇక్కడ పేర్కొన్న "హసనతు ద్దునియా" అనే పదంలో ఒక ముస్లిం విశ్వాసి ప్రపంచాన్ని సాధించడానికి అనుసరించాల్సిన అన్ని శ్రేష్ఠమైన మార్గాలను గూర్చి ప్రస్తావించడం జరిగింది." ప్రపంచ సాధనలో కూడ మంచి మార్గాలకే ప్రాధాన్యతను ఇచ్చినచో అప్పుడు అతడు ప్రపంచ సాధనకై ఎలాంటి తప్పుడు విధానాలను, పద్ధతులను అనుసరించడు. ధార్మికతకే ప్రాధాన్యతను ఇచ్చును. అల్లాహు ప్రసన్నతకే ప్రాధాన్యతను ఇచ్చును. కావున అందుకు అనుగుణముగానే మానవుడు తమ కార్యకలాపాలను నిర్వహించును. మరల ఇలా తెలిపారు. "ప్రాపంచికను సాధించుటకు అనుసరించు విధానంలో మంచి, శ్రేష్ఠతలే ఉండాలి కాని, ఇతరులకు హాని కల్గించే ఏ విధానాన్ని గాని, సాటి మానవుల గౌరవ మర్యాదలకు భంగం కల్గించు విధానాలను గాని అనుసరించకూడదు. ఇలాంటి ప్రాపంచికతను సాధించినప్పుడే అది పరలోకమునకు కూడ లాభదాయకముగా నిలుస్తుంది."

**(మల్ఫూజాత్, సంపుటి 2, పేజి 91-92, ముద్రణ 1984).**

కావున ఈ ప్రపంచాన్ని సాధించడంలో కూడ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క కృపను పొందుటయే లక్ష్యముగా ప్రయత్నించాలి. మరియు ధర్మమునకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇవ్వవలెను. ఇలా చేసినప్పుడు మనం దుఆల నుండి అసలైన దైవానుగ్రహాలను పొందుతాము.

ఒక సందర్భంలో జమాత్‌కు సలహా ఇస్తూ,హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "ఈ ప్రస్తుత కాలంలో మా జమాత్ సభ్యులు ప్రత్యేకంగా ఈ ప్రార్థనను చదవాలి:

**రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతన్ వ్వఫిల్ ఆఖిరతి హసనతన్ వ్వఖినా అజాబన్నార్.**

**(మాల్ఫుజాత్ , సంపుటి 1, పేజీ. 9, ఎడిషన్ 1984)**

ఎందుకనగా మనం ధర్మమునకు ప్రపంచంపై ప్రాధాన్యతనిచ్చే వారిగా మారుతాము. అదే విధముగా శత్రువులు రాజేసిన వ్యతిరేకతల నుండి కూడ మనం రక్షించబడతాము. నేటి రోజుల్లో, ప్రపంచ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చూసినచో, యుద్ధాలలో అగ్నిని విసురునట్టి ఆయుధాలను ఉపయోగిస్తున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని అట్టి అగ్ని కాండము నుండి కూడ రక్షించి, ఇహలోకంలో మరియు ఇహలోకంలో మంచిని ప్రసాదించుగాకా!.

అహ్మదీలు తమ కోసం మరియు ప్రపంచ ప్రజలందరి కోసం ప్రత్యేకంగా దుఆలు చేయాలి.

మరల మనం నేటి రోజులలో ఈ క్రింది దుఆను కూడ చాలా వేదనతో మరియు కలవరంతో పఠించవలసిన అవసరం ఉన్నది. ఇది ఖురాన్ దుఆ:

**రబ్బనా అఫ్‌రిఘ్ అలైనా సబ్‌రన్ వ్వసబ్బిత్ అఖ్‌దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్. (బఖర: 251)**

"ఓ మా ప్రభువు!, మాపై సర్వక్షమాశక్తిని కురిపించుము. మరియు యుద్ధ రంగమున మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము. అవిశ్వాసులకు వ్యతిరేకముగా మాకు సహాయంను అందించుము. " మరో మాటలో చెప్పాలంటే, ఎలాంటి భయంలోగాని, ఎలాంటి పరిస్థితులలో గాని మా అడుగులను తడబడకుండా చూడుము.

మరల ఈ దుఆను కూడ పదేపదే విలపిస్తూ పఠిస్తూ ఉండాలి.

رَبَّنَا لَا تُؤَاخِذْنَآ اِنْ نَّسِيْنَآ اَوْ اَخْطَاْنَا ۚ رَبَّنَا وَلَا تَحْمِلْ عَلَيْنَآ اِصْرًا كَمَا حَمَلْتَهٗ عَلَى
الَّذِيْنَ مِنْ قَبْلِنَا ۚ رَبَّنَا وَلَا تُحَمِّلْنَا مَا لَا طَاقَةَ لَنَا بِهٖ ۚ وَاعْفُ عَنَّا ۗ وَاغْفِرْ لَنَا ۗ وَارْحَمْنَا ۗ
اَنْتَ مَوْلٰىنَا فَانْصُرْنَا عَلَى الْقَوْمِ الْكٰفِرِيْنَ (البقرۃ:287)

"ఓ మా ప్రభువు! మేము మరచిపోయినా లేదా తప్పులో పడ్డా మమ్మల్ని శిక్షించపకుము. ఓ మా ప్రభువు! , మా కంటే పూర్వమున్న వారిపై (వారి పాప ఫలితముగా) మోపిన భారమును మాపై వేయకుము. ఓ మా ప్రభువు! మేము మోయలేని భారమును మాపై వేయకుము. మా పాపములను క్షమించుము. మాకు క్షమాభిక్షను ప్రసాదించుము. మమ్ము అనుగ్రహించుము. నీవే మాకు యజమానివి. కావున అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయంను అందించుము."

**(బఖర:287)**

మన విశ్వాసాన్ని బలపరచుకోవడానికి మనం ఈ క్రింది దుఆనును కూడా చదవాలి: **రబ్బనా లాతుజిఘ్ ఖులూబనా బఅద ఇజ్ హదైయితనా వ హబ్‌లనా మిన్ ల్లదున్‌క రహమతన్ ఇన్నక అంతల్ వహ్హాబ్.** (ఆలేఇమ్రాన్:9)

"ఓమా ప్రభువు! నీవు మాకు మార్గదర్శనం చేసిన తర్వాత మా హృదయాలు చంచలము కాకుండా చూడుముగాకా!. మాకు నీ అనుగ్రహమును ప్రసాదించుము. నిశ్చయంగా, నీవే వర ప్రదాతవు."

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మనకు నేర్పించిన కొన్ని దుఆలను ఇప్పుడు నేను మీ ముందు ప్రస్తావిస్తాను. ఒకసారి హజ్రత్ అబూ బకర్ రజియల్లాహ్ తాలా అన్‌హు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని నేను నమాజ్‌లో వేడుకొనుకుటకు నాకు ఒక దుఆను నేర్పించండి అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ (స) ఈ క్రింది విధంగా పఠించాలని పేర్కొన్నారు:

**అల్లాహుమ్మ ఇన్ని జలంతు నఫ్‌సి జుల్‌మన్ కసీరన్ వలా యఘ్‌ఫిరు జ్జునూబ ఇల్లా అన్‌త ఫఘ్‌ఫిర్‌లీ మఘ్‌ఫిరతన్ మిన్ ఇన్‌దిక వర్ హమ్‌ని ఇన్నక అంతల్ ఘఫూరు ర్రహీం.**

"ఓ అల్లాహ్!, నేను నా జీవితంపై చాలా ఎక్కువగా దౌర్జన్యం చేసుకున్నాను. నీవు తప్ప నా పాపములను క్షమించగలవాడెవడూ లేడు, కాబట్టి నీవు నీ దయానుగ్రహాలతో నన్ను క్షమించుము. మరియు నాపై కరుణించుము. . నిశ్చయంగా నీవే క్షమాప్రపూర్ణుడవు. పదే పదే కరుణించువాడవు." **(సహీ బుఖారి, కితాబు ద్దవాత్, బాబుద్దువా మా ఫిస్సలాత్, హదీస్ 6326)**

హుజూర్ (స) హజ్రత్ అబూ బకర్ రజిను ఈ ప్రార్థనను చదవమని ప్రత్యేకంగా నొక్కి చెప్పారు.

మరల ముస్అబ్ బిన్ సాద్ రజి తన తండ్రిని ఆధారం చేసుకొని ఇలా ఉల్లేఖించారు. ఒకసారి ఒక గ్రామీణ వ్యక్తి దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి, నేను పఠించుటకై నాకు ఏదేని ఒక దుఆను నేర్పించమని అభ్యర్థించాడు. అందుకు దైవ ప్రవక్త (స) ఇలా నేర్పించారు:

**లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీక లహు, అల్లాహు అక్‌బరు కబీరన్, వల్ హందులిల్లాహి కసీరన్, సుబహానల్లాహి రబ్బిల్ ఆలమీన్, లా హౌలా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అజీజిల్ హకీమ్.**

"అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు ఎవరూ లేరు, అతను ఒక్కడే మరియు అతనికి భాగస్వామి లేడు. అల్లాహ్ గొప్పవాడు, సకల ప్రశంసలన్నియు అతనికే చెందుతాయి. సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ పవిత్రుడు. సర్వాధికారి, వివేకవంతుడు అయిన అల్లాహ్ తప్ప మరెవ్వరు శక్తిమంతుడు మరియు బలవంతుడు కాడు". మరల ఆ గ్రామీణుడు ఇలా విన్నవించుకున్నాడు. ఓ అల్లాహ్ ప్రవక్తా!. ఈ దుఆ నా ప్రభువు కొరకు, నేను అతనిని స్తుతించుచున్నాను. కాని నా కోసం నేను పారాయణం చేయవలసిన దుఆ ఏమిటి? " అందుకు హుజూర్ (స) ఇలా తెలిపారు.

**అల్లాహుమ్మఘ్‌ఫిర్‌లీ వర్‌హమ్‌నీ వహ్‌దినీ వర్‌జుక్‌నీ .**

"ఓ అల్లాహ్! నన్ను క్షమించుము, నాపై దయ చూపుము, నాకు మార్గనిర్దేశం చేయుము, నాకు సంపదను అందించుము. "

**(సహీ ముస్లిం, కితాబుజ్జికర్ వ ద్దుఆ ...... బాబ్ ఫజలు త్తహలీలు వ తస్బీహ్ వ దుఆ హదీస్ 6848)**

మరొక కథనంలో ఇలా గలదు. ఎవరైన ఇస్లాంను స్వీకరించినప్పుడు, అతనికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ క్రింది దుఆను నేర్పించేవారు. అబూ మాలిక్ అష్జాయ్ తన తండ్రిని ఆధారం చేసుకొని ఇలా ఉల్లేఖించారు. ఎవరైన ఇస్లాంను స్వీకరించినచో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారికి నమాజ్ చదవడంను నేర్పించేవారు. ఆ తరువాత ఈ క్రింది పదాలతో దుఆ చేయమని హుజూర్ (స) అతనికి సూచించేవారు.

**అల్లాహుమ్మఘ్‌ఫిర్‌లి వర్‌హమ్‌నీ వహ్‌దినీ వ ఆఫానీ వర్‌జ్జుఖ్‌నీ.**

(సహీ ముస్లిం, కితాబుజ్జికర్ వ ద్దుఆ ...... బాబ్ ఫజలు త్తహలీలు వ తస్బీహ్ వ దుఆ హదీస్ 6850)

**"ఓ అల్లాహ్! నన్ను క్షమించుము, నాపై దయ చూపుము, నాకు మార్గనిర్దేశం చేయుము, నాకు రక్షణ కల్పించుము, నాకు సంపదను అందించుము. "** మనం రెండు సజ్దాల మధ్యలో గల దుఆ సమయంలో కూడ మనం ఈ దుఆనే పఠిస్తుంటాము. కాని ప్రజలు మాత్రం సజ్దాల నుండి లేచి సాధారణముగా కూర్చుంటున్నారు. బహుశా వారు ఈ దుఆను పఠించడం లేదు కావచ్చును. వారి దృష్టిలో బహుశ ఇట్టి దుఆకు ఎలాంటి ప్రాధాన్యత లేదనిపిస్తుంది. నిజానికి ఈ దుఆను చాలా శ్రద్ధతో, అర్థం చేసుకుంటూ చదువవలెను. ఇందులో సంపద (రిజఖ్) అని వచ్చింది. దీని అర్థం ప్రాపంచిక సంపదతో పాటు ఆధ్యాత్మిక సంపద కూడ వస్తుంది. ఆధ్యాత్మిక సంపదలో కూడ వృద్ధి చెందాలనేది ఈ దుఆ ఉద్దేశం.

కాబట్టి, మనం ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని దుఆ చేయాలి. మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను స్తుతిస్తున్నప్పుడు, మన స్వంత సంస్కరణ, మార్గదర్శకత్వం మరియు మన ఆధ్యాత్మికతలో మనం రాణించటానికి కూడా ఈ దుఆను పఠించాలి. అంతేగాకుండా మన అంతర్గత, బహిర్గతల స్థితిగతులు కూడ ఉన్నతీకరించబడుటకు కూడ మనం ఈ దుఆను పఠించాలి. మనం శ్రద్ధతో చదివినప్పుడే అన్ని రకాల అనుగ్రహాలు మనపై కురుస్తుంటాయి.

మరల ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నేర్పించిన మరొక దుఆ ఇలా గలదు. ఈ దుఆను హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మేల్కొన్నప్పుడు ఈ దుఆను పఠించేవారు.

**లా ఇలాహ ఇల్లా అంత సుబ్‌హానక అల్లాహుమ్మ అస్తఘ్‌ఫిరుక లిజన్‌బీ, వ అస్‌అలుక రహమతక అల్లాహుమ్మ జిద్‌నీ ఇల్‌మన్, వలా తుజిఘ్ ఖల్‌బీ బఅద ఇజ్ హదైతని వ హబ్‌లీ మిల్లదున్‌క రహమతన్ ఇన్నక అంతల్ వహ్హాబ్.** (సునన్ అబూ దవూద్, అబువాబు న్నౌమ్, మా యఖూలు ర్రజుల్ ఇజా తఆరి మినల్లైలి హదీస్ 5061)

“ఓ అల్లాహ్, నువ్వు తప్ప ఆరాధనకు అర్హుడు మరొకడు లేడు. ఓ అల్లాహ్ నేను నా పాపాలకు క్షమాపణ కోరుతున్నాను మరియు నీ దయను కోరుతున్నాను. ఓ అల్లాహ్!, నా జ్ఞానాన్ని పెంచు, మరియు నీవు నాకు మార్గనిర్దేశం చేసిన తర్వాత నా మనస్సు వక్రబుద్ధి చెందకుండా చూడుము. నీ సన్నిధి నుండి నాపై కరుణను కురిపించుము. నిశ్చయంగా, నీవు మాత్రమే అందరి కంటే ఎక్కువగా అనుగ్రహించు వాడవు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ అనస్ బిన్ మలిక్ రజి ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని విషయం గురించి ఆందోళన చెందుతున్నప్పుడు, ఈ దుఆను పఠించేవారు.

**యా హయ్యు యా ఖయ్యూము బిరహమతిక అస్తఘీస్.**

(సునన్ తిర్మిజి, అబువాబు ద్దావత్, హదీస్ 3524)

“ఓ సజీవుడా! మరియు ఇతరులకు జీవనం ఇచ్చువాడా! ఓ సుస్థిరపరుడా! ఇతరులకు స్థిరత్వంను ప్రసాదించువాడా! నీ కరుణతో నాకు సహాయంను అందించుము. ”

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమర్ బిన్ ఆస్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. నిశ్చయముగా ఉపవాసగ్రస్తుడు ఉపవాసంను విరమించే సమయంలో చేసిన దుఆ తిరస్కరించబడదు.” ఇబ్నే అబీ ములైకా ఇలా తెలిపారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ రజి ఉపవాసంను విరమించునప్పుడు ఈ దుఆ చేసేవారు.

**అల్లాహుమ్మ ఇన్ని అస్‌అలుక బి రహమతిక అల్లతి వసిఅత్ కుల్ల షైయిన్ అన్ తఘ్‌ఫిరలీ.** (సునన్ ఇబ్నే మాజా, కితాబుస్సౌమ్, బాబ్ ఫీ (సాయిము తా తురద్దు దావతు) హదీస్ 1753)

“ఓ అల్లాహ్! సర్వసృష్టిపై వ్యాపించి ఉన్న నీ కరుణను నాపై కురిపించమని నేను నిన్ను యాచిస్తున్నాను. నీవు నన్ను క్షమించుము. ”

మరల హజ్రత్ ఉమ్మే సల్మా రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ క్రింది దుఆను పఠించేవారు.

**రబ్బిఘ్‌ఫిర్ వర్‌హమ్ వహ్‌దినీ లిత్తరీఖిల్ ఖౌమి.**

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 8, పేజి 610, ఉమ్మే సల్మాతు జౌజన్నబియు సల్లల్లాహు అలైహి వసల్లం హదీస్ 27126, ఆలముల్ కుతుబ్ బెహరూత్‌ఎc 1998).

“ఓ అల్లాహ్! నన్ను క్షమించుము, నాపై దయ చూపుము, మరియు నన్ను నీ చక్కని, సరైన మరియు దృఢమైన మార్గంలో నడిపించుము.

ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ దుఆలను చేసినందున మరి మనం ఇంకా చాలా శ్రద్ధతో, అధికముగా ఈ దుఆలను చేయవలసి యున్నది.

ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరొక దుఆను గూర్చిన ప్రస్తావన ఇలా గలదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా గారు ఇలా తెలిపారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్‌లలో ఈ దుఆ చదివేవారు.

**అల్లాహుమ్మ ఇన్ని అవూజుబిక మిన్ అజాబిల్ ఖబ్‌రి, వ అఊజుబిక మిన్ ఫిత్‌నతిల్ మసీహి దజ్జాలి వ అఊజుబిక మిన్ ఫిత్‌నతిల్ మహ్‌యా వ ఫిత్‌నతిల్ మమాతి అల్లాహుమ్మ ఇన్ని అఊజుబిక మినల్ మఅసమి వల్ మఘ్‌రమి.**

(సహీ బుఖారి, కితాబుల్ అజాన్ బాబుద్దుఆ ఖబలల్ ఇస్లామీ, హదీస్ 832)

“ఓ అల్లాహ్, నేను సమాధి శిక్ష నుండి నీ శరణు కోరుకుంటున్నాను. మరియు మసీహుద్దజ్జాల్ నుండి నేను నీ శరణు కోరుకుంటున్నాను. మరల నేను జీవితం మరియు మరణం యొక్క పరీక్షల విపత్తుల నుండి నీ శరణు కోరుకుంటున్నాను. ఓ అల్లాహ్! నేను పాపంల నుండి మరియు అప్పుల నుండి కూడ నీ అభయాన్ని కోరుకుంటున్నాను. ప్రశ్నించేవారిలో ఒకరు హుజూర్ (స) సన్నిధిలో ఈ విధముగా విన్నవించుకున్నాడు. “ మీరు (స) ఇంతగా ఎందుకు అప్పుల భారం నుండి అభయాన్ని కోరుకుంటున్నారు?. అందుకు హుజూర్ (స) ఇలా తెలిపారు. ఎప్పుడైతే మానవునిపై అప్పుల భారం పడుతుందో అప్పటి నుండి అతడు మాట్లాడినప్పుడు అసత్యంను మాట్లాడుతాడు, ఏదైన ప్రమాణం చేసినప్పుడు వారు దానిని ఉల్లంఘిస్తారు.

ఇప్పుడు ఈ దుఆను పరిశీలించినచో నిస్సందేహంగా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తాను ప్రార్థిస్తున్న ఈ విషయాలన్నింటికీ అతీతంగా ఉన్నారు. కావున వారి సమాజీకులు అబద్ధం మాట్లాడకూడదని మరియు ప్రమాణాలను ఉల్లంఘించకూడదని ఈ దుఆలన్నియు తమ సమాజీకుల కోసం చేస్తున్నారు. మనం కూడ ఈ దుఆలను చేస్తున్నాము కావున మనం నిజంగా ఈ విషయాలకు కట్టుబడి ఉన్నామా? లేదా? అని మనల్ని మనం విశ్లేషించుకోవాలి. కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ దుష్ప్రభావాల నుండి కాపాడాలని మరియు ఈ లోకపు మంచిని మనకు అనుగ్రహిస్తూనే ఉండాలని దుఆలు చేయాలి.

మరల ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఒక దుఆను హజ్రత్ ఆయిషా రజి ఈ విధంగా వివరించారు. చిన పవిత్ర ప్రవక్త యొక్క ప్రార్థన ఉంది. ఇది చాలా పెద్ద దుఆ, అందుకే నేను అనువాదాన్ని చదువుతాను:

[اللّٰهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنَ الكَسَلِ وَالْهَرَمِ وَالْمَغْرَمِ وَالْمَأْثَمِ. اللّٰهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ عَذَابِ النَّارِ وَفِتْنَةِ النَّارِ، وَفِتْنَةِ الْقَبْرِ وَعَذَابِ الْقَبْرِ، وَ شَرِّ فِتْنَةِ الْغِنَى، وَ شَرِّ فِتْنَةِ الْفَقْرِ، وَ شَرِّ فِتْنَةِ الْمَسِيحِ الدَّجَّالِ، اللّٰهُمَّ اغْسِلْ خَطَايَايَ بِمَاءِ الثَّلْجِ وَالْبَرَدِ، وَنَقِّ قَلْبِي مِنَ الخَطَايَا، كَمَا يُنَقَّى الثَّوْبُ الْأَبْيَضُ مِنَ الدَّنَسِ، وَبَاعِدْ بَيْنِي وَبَيْنَ خَطَايَايَ كَمَا بَاعَدْتَ بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ]

“ఓ అల్లాహ్, నేను అలసత్వం మరియు వృద్ధాప్యం నుండి, అప్పుల నుండి మరియు పాపంల నుండి నీ శరణు కోరుతున్నాను. ఓ అల్లాహ్! నరకపు శిక్ష నుండి మరియు నరకపు కష్టాల నుండి, సమాధి యొక్క కష్టాల నుండి మరియు సమాధి యొక్క శిక్ష నుండి, సంపన్నపు దుష్ప్రభావాల నుండి మరియు పేదరికపు దుర్గుణాల నుండి మరియు మసీహ్ దజ్జాల్ కుట్రల నుండి నేను నీ శరణు కోరుతున్నాను. ఓ అల్లాహ్! చల్లని మంచు నీటితో నా పాపాలను కడిగి, తెల్లని వస్త్రాల నుండి మురికిని శుభ్రపరచినట్లుగా, నా హృదయాన్ని అన్ని పాపాల నుండి శుభ్రపరచుము. ఏ విధముగానైతే నీవు తూర్పు మరియు పడమరల మధ్య దూరంను ఏర్పాటు చేశావో అదే విధముగా నాకు మరియు నా పాపాలకు మధ్య సుదూరంను ఏర్పాటు చేయుము.

**(సహీబుఖారి, కితాబుద్దావత్, బాబ్ ఇస్తిఆజతు మిన్ అరజలిల్ ఉమ్‌రి ......... హదీస్ 6375)**

ఈ ఒక్క దుఆలోనే అనేక అంశాలు ప్రస్తావించబడ్డాయి.

నేను ఇంతకుముందే చెప్పినట్లు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలాంటి దుఆలు చేసేవారు. ఇంతకు ముందు హదీసు కూడా దీనితో కొంత పోలికను కల్గియున్నది. అలాంటప్పుడు మనం ఇంకా ఎంతో శ్రద్ధతో, భయంతో దుఆలను చేయాలి. కాబట్టి, ఈ ప్రార్థనల ద్వారానే మన వ్యక్తిగత జీవితంలో మార్పు తీసుకురాగలము మరియు సమాజిక జీవితంలో కూడ ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే, అదే సమయంలో, ఈ ప్రార్థనలు చేస్తున్నప్పుడు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విలపించినట్లుగా మనం కూడ విలపించవలెను. హుజూర్ (స) ఈ దుఆలను తమ కోసం చేసుకునేవారు కాదు, తమ సమాజం కోసం చేసేవారు. కావున ఈ దుఆలను పఠిస్తూ హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మనస్సు తపించిపోయారు అనే విషయాన్ని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

హుజూర్ (స) మసీహ్ ద్దజ్జాల్ కుట్రల నుండి కూడ శరణు కోరినారు. ఆ కుట్రలు నేడు చాలా భయంకరమైన స్థాయిలో ఉన్నాయి. ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన అనుచరులుగా ప్రకటించుకునే మసీహ్ మౌవూద్ (అ) శిష్యులు ప్రత్యేకించి ఈ దుఆల వైపు శ్రద్ధను చూపవలెను. ఈ విపత్తుల నుండి కాపాడ బడుటకు, ప్రత్యేకించి మసీహ్ ద్దజ్జాల్ విపత్తి నుండి కాపాడబడుటకు , అదే విధముగా ప్రపంచాన్ని రక్షించడం కోసం ఈ దుఆ చాలా అవసరం.

బుఖారిలో ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తహజ్జుద్ నమాజ్‌లో చదివే ఒక దుఆను గూర్చి ప్రస్తావన గలదు. హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజియల్లాహ్ అన్‌హుమా ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రివేళ మేల్కొని తహజ్జుద్ నమాజ్ సల్పుతూ ఈ దుఆను చదివేవారు. ఇది సుదీర్ఘమైన దుఆ. అందుకే దాని అనువాదంను వినిపిస్తున్నాను.

[اللّٰهُمَّ لَكَ الْحَمْدُ أَنْتَ قَيِّمُ السَّمٰوٰتِ وَالْأَرْضِ وَمَنْ فِيْهِنَّ وَلَكَ الْحَمْدُ لَكَ مُلْكُ السَّمٰوَاتِ وَالْأَرْضِ وَمَنْ فِيْهِنَّ وَلَكَ الْحَمْدُ أَنْتَ نُوْرُ السَّمٰوٰتِ وَالْأَرْضِ وَمَنْ فِيْهِنَّ، وَلَكَ الْحَمْدُ أَنْتَ الْحَقُّ، وَوَعْدُكَ حَقٌّ، وَلِقَاؤُكَ حَقٌّ، وَقَوْلُكَ حَقٌّ، وَالْجَنَّةُ حَقٌّ، وَالنَّارُ حَقٌّ، وَالنَّبِيُّوْنَ حَقٌّ، وَمُحَمَّدٌ(صلّى الله عليه وسلّم) حَقٌّ، وَالسَّاعَةُ حَقٌّ، اللّٰهُمَّ إِلَيْكَ أَنَبْتُ، وَبِكَ خَاصَمْتُ، وَإِلَيْكَ حَاكَمْتُ، فَاغْفِرْ لِيْ مَا قَدَّمْتُ وَمَا أَخَّرْتُ، وَمَا أَسْرَرْتُ وَمَا أَعْلَنْتُ، أَنْتَ الْمُقَدِّمُ وَأَنْتَ الْمُؤَخِّرُ، لَا إِلٰهَ إِلَّا أَنْتَ، أَوْلَا إِلٰهَ غَيْرُكَ]

ఓ అల్లాహ్!, ప్రశంసలన్నియు నీకే చెందుతాయి. నీవే ఆకాశములను మరియు భూమిని మరియు వాటిలో ఉన్నవాటినన్నింటిని సుస్థిరపర్చువాడవు. మరియు అన్ని ప్రశంసలు నీవే అర్హుడవు. భూమ్యాకాశములు మరియు వాటిలో ఉన్న వాటిఅన్నింటిపై సార్వభౌమాధికారం కూడ నీదే. అన్ని స్తుతులు నీకే చెందుతాయి, నీవు భూమ్యాకాశములు మరియు వాటిలో ఉన్న ప్రతి ఒక్కదానికి తేజస్సువు. అన్ని ప్రశంసలు నీకే చెందుతాయి. నీవు సత్యవంతుడవు, నీ వాగ్దానం నిజమైనది. నీ వద్దకు తిరిగి రావడం నిజం మరియు నీ మాట నిజం. స్వర్గం మరియు నరకం నిజం. ప్రవక్తలందరూ నిజం మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యం మరియు వాగ్దాన సమయం నిజం. ఓ అల్లాహ్!, నేను నీ వైపు మొగ్గు చూపుతున్నాను. నీ కొరకు నేను శత్రువుతో వివాదం చేసాను మరియు నీ నుండి తీర్పు కోరుచున్నాను. కాబట్టి నా గత పాపములను మరియు ప్రస్తుతం జరిగిన పాపాలన్నింటినీ క్షమించుము. కొన్నింటిని నేను గోప్యముగా ఉంచాను, మరికొన్ని బహిర్గతము చేశాను. నీవే మొదటివాడవు, నీవే చివరి వాడవు. కేవలం నీవే అరాధనకు అర్హుడవు. లేదా నీవు తప్ప మరో ఆరాధ్యదైవం లేదు.

**(సహి బుఖారి, కితాబు త్తహాజ్జుద్, బాబు త్తహాజ్జుద్ బిల్లైల్ హదీస్ 1120)**

హజ్రత్ అబూ హురైర రజియల్లాహు తాలా ఇలా తెలిపారు. ఒక వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నేను నిన్న రాత్రి మీ దుఆను విన్నాను మరియు ఆ దుఆలో నుండి నాకు ఈ కొద్ది భాగమే గుర్తున్నది.

**అల్లాహుమ్మఘ్ఫిర్‌లి జన్‌బి వ వస్సిఉలి ఫీ దారీ వ బారిక్ లీ ఫీమా రజఖ్తని.**

“ఓ అల్లాహ్!, నా పాపాలను క్షమించు, నా ఇంటిని నా కోసం విశాల పర్చుము. నీవు నాకు అనుగ్రహించిన సంపదలో నా కొరకు శుభములను కల్పించుము.” అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఆ దుఆలో నీకు ఏదైన తప్పిపోయినట్లు అనిపిస్తుందా?.

**(సునన్ తిర్మిజి, అబువాబు ద్దావత్, హదీస్ 3500)**

ఇవిఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దుఆలు. కనీసం వాటి అనువాదంను అయినా గుర్తుచేసుకొని, లేదా ఆ దుఆ భావాన్ని అర్థం చేసుకొని మనము కూడ ఆ విధముగా దుఆలు చేసుకోవాలి.

మరల బుఖారికి చెందిన ఒక దుఆలు ఇలా గలదు.

اَللّٰهُمَّ اجْعَلْ فِيْ قَلْبِيْ نُوْرًا، وَفِيْ بَصَرِيْ نُوْرًا، وَفِيْ سَمْعِيْ نُوْرًا، وَعَنْ يَمِيْنِيْ نُوْرًا، وَعَنْ يَسَارِيْ نُوْرًا، وَفَوْقِيْ نُوْرًا، وَتَحْتِيْ نُوْرًا، وَأَمَامِيْ نُوْرًا، وَخَلْفِيْ نُوْرًا، وَاجْعَلْ لِيْ نُوْرًا۔

**(సహి బుఖారి, కితాబుద్దావత్, బాబు ద్దుఆ, ఇజా ఇన్‌తబ మినల్లైలి, హదీస్ 6316)**

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ దుఆలలో ఈ దుఆను కూడ చేసేవారని నమోదు చేయబడింది, “ఓ అల్లాహ్!, నా హృదయంలో కాంతిని ప్రసాదించుము, నా దృష్టి, నా చూపులో కాంతిని ప్రసాదించుము, నా వినికిడిలో కాంతిని ప్రసాదించుము, నా కుడి వైపున కాంతిని ప్రసాదించుము, నా ఎడమ వైపున కాంతిని ప్రసాదించుము, నా పైన కాంతిని ప్రసాదించుము, నా క్రింద కాంతిని ప్రసాదించుము, నా ముందు కాంతిని ప్రసాదించుము, నా వెనుక కాంతిని ప్రసాదించుము, మరియు నా సర్వస్వమును కాంతిమయముగా చేయుము.”

మరల ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి మరొక దుఆ ఇలా గలదు. జియాద్ బిన్ ఇలాఖా తన పిన్నాన్న ఖుత్‌బా బిన్ మాలిక్ ను ఆధారం చేసుకొని ఉల్లేఖించారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ దుఆ చేసేవారు.

| అహ్‌దీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

**అల్లాహుమ్మా ఇన్ని అవూజూబిక మిన్ మున్‌కిరాతిల్ అఖ్‌లాఖి వల్ అఅమాలి వల్ అహ్‌వాఇ.**

“ఓ నా అల్లాహ్!, చెడు లక్షణాల నుండి, చెడు పనుల నుండి, చెడు కోరికల నుండి నేను నీ రక్షణను కోరుతున్నాను.”

**(సునన్ తిర్మిజి, అబ్వాబ్ ద్దావత్, బాబు దుఆ ఉమ్మే సల్మమతు హదీస్ 3591)**

ఇది చాలా సంక్షిప్తమైన దుఆ, ప్రతి ఒక్కరూ సులభంగా దీనిని పఠించగలరు, “చెడు లక్షణాల నుండి, చెడు పనుల నుండి, చెడు కోరికల నుండి నేను నీ రక్షణను కోరుతున్నాను” ఒకవేళ మానవుడు ఈ దుఆను చేసినచో, పదే పదే యాచించినచో అనేక చెడు అలవాట్లు అన్నియు దూరమైపోతాయి మరియు పుణ్యకార్యములు చేయాలనే ప్రేరణ కల్గుతుంది.

మరొక కథనము ఈ విధముగా గలదు. హజ్రత్ అబూ ఉమామా రజి ఇలా పేర్కొన్నట్లు ఒక కథనంలో నమోదు చేయబడింది, “ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహివ సల్లం చాలా దుఆలు చేసేవారు, కావున వాటిని మేము గుర్తుంచుకోలేక పోయాము. కూర్చొని ఉండవచ్చును, దుఆలను నేర్చుకుంటూ ఉండవచ్చును. చాలా దుఆలు చేసి ఉండవచ్చును. అందువలన మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని ఇలా విన్నవించుకున్నాము. ఇన్ని దుఆలు చేసినందున మేము ఏ దుఆలను సరిగ్గా గుర్తుంచుకోలేక పోయాము. మరల ఇలా తెలిపారు. మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా విన్నవించు కున్నాము. ఓ రూలుల్లాహ్ (స)! మీరు చాలా దుఆలు చేశారు. కాని మాకు ఆ దుఆలలలో ఒక్కటి కూడ గుర్తుకు లేదు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. అలాగైనచో నేను మీకు ఒక దుఆను నేర్పించుతాను. ఆ దుఆ అన్ని దుఆలకు సారంశముగా ఉంటుంది.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏ దుఆను నేర్పించినారో ఆ దుఆను శ్రద్ధగా వినండి!. మరల ఇలా తెలిపారు. మీరు ఇలా దుఆ చేయండి!.

[اَللّٰهُمَّ إِنَّا نَسْأَلُكَ مِنْ خَيْرِ مَا سَأَلَكَ مِنْهُ نَبِيُّكَ مُحَمَّدٌ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ، وَنَعُوْذُ بِكَ مِنْ شَرِّ مَا اسْتَعَاذَ مِنْهُ نَبِيُّكَ مُحَمَّدٌ صَلَّى اللّٰهُ عَلَيْهِ وَسَلَّمَ، وَأَنْتَ الْمُسْتَعَانُ، وَعَلَيْكَ الْبَلَاغُ، وَلَا حَوْلَ وَلَا قُوَّةَ إِلَّا بِاللّٰهِ]

ఓ అల్లాహ్!, నీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కోరిన మంచిని మేము నీ నుండి కోరుకుంటున్నాము. నీ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నీ శరణు కోరిన ప్రతి చెడు నుండి మేము నీ శరణు కోరుతున్నాము. నీవు నిజమైన సహాయకుడివి. మేము నిన్ను మాత్రమే ప్రార్థిస్తాము. అల్లాహ్ సహాయం లేకుండా, మాకు సత్కార్యములను చేయు స్థోమతగాని లేదా సాతాను దాడుల నుండి రక్షించుకునే శక్తిగాని లేదు .”

**(సునన్ తిర్మిజి, అబువాబు ద్దావత్, హదీస్ 3521)**

మనం ఈ దుఆ చేసినచో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల మన హృదయంలో ప్రేమ పెరుగడంమే కాకుండా, సర్వ సమగ్రమైన దుఆలన్నియు ఒక్కొటికిగా మన మనస్సులో నుండి వెలువడుతాయి.

మరల క్షమాపణ మరియు మన్నింపులను పొందు దుఆ ఒకటి గలదు. హజ్రత్ అబూ మూసా అష్రీ రజియల్లాహ్ తాలా అన్‌హు కుమారుడు తన తండ్రిని ఆధారం చేసుకొని ఈ విధముగా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధముగా దుఆ చేసేవారు.

[رَبِّ اغْفِرْلِيْ خَطِيْئَتِيْ وَ جَهْلِيْ وَإِسْرَافِيْ فِيْ أَمْرِيْ كُلِّهٖ وَمَا أَنْتَ أَعْلَمُ بِهٖ مِنِّيْ اَللّٰهُمَّ اغْفِرْلِيْ خَطَايَايَ وَعَمْدِيْ وَجَهْلِيْ وَ جِدِّيْ وَكُلُّ ذٰلِكَ عِنْدِيْ اَللّٰهُمَّ اغْفِرْلِيْ مَا قَدَّمْتُ وَمَا أَخَّرْتُ وَمَا أَسْرَرْتُ وَمَا أَعْلَنْتُ أَنْتَ الْمُقَدِّمُ وَأَنْتَ الْمُؤَخِّرُ وَأَنْتَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ]

“ఓ నా ప్రభువు!, నా తప్పులను, నా అజ్ఞానంను, నా కన్న ఎక్కువ నీకే తెలిసిన నా అతిక్రమాలన్నింటిని నాతోపాటు క్షమించుము. (ఇప్పుడు ఇక్కడ ఆం సల్లల్లాహు అలైహివ సల్లం దుఆ చేస్తున్నారు. హుజూర్ (స)లో ఇలాంటి చెడులు, తప్పిదాలను మనం ఊహించనే ఉహించము. అయినా కూడ ఎవరి కోసం చేస్తున్నారు?. సమాజం కొరకు దుఆలు చేస్తున్నారు. సమాజీకులకు నేర్పించడం

| అహ్‌దీస్ బోధనలు | **“ఒక మునసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన మునసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.” అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

కోసం చేస్తున్నారు. ఇలా దుఆ చేస్తున్నారు.) ఓ నా అల్లాహ్!, నా తప్పులను క్షమించుము. నేను తెలిసి మరియు తెలియక చేసిన తప్పులను, నేను ఉద్దేశపూర్వకముగా చేసిన తప్పులను, అజ్ఞానంలో మరియు విజ్ఞానంలో చేసిన నా తప్పులను నాతో పాటుగా క్షమించుము. ఈ తప్పులన్ని నేనే చేశాను. ఓ అల్లాహ్!, నన్ను, నేను ఇంతకు ముందు చేసిన తప్పులను, తరువాత చేసిన తప్పులను, నేను ఎవరికి తెలియకుండా చేసిన తప్పులను, నేను బయటికి కనిపించు విధముగా చేసిన తప్పులను క్షమించుము. నీవే మొదటివాడవు, నీవే చివరి వాడవు. నీవే సర్వ సృష్టిపై అధికారం గలవాడవు."

**(సహీ బుఖారీ, కితాబ్ దావత్, ............హదీస్ 6398)**

ఇది సహీ–బుఖారీకి చెందిన కథనం. మనం కూడ ఈ విధముగా దుఆలు చేయాలని వీటిని పొందుపర్చడం జరిగింది. మనకోసమే ఈ దుఆలను నేర్పించడం జరిగింది.

మరల కష్టాలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు చేయునట్టి దుఆను కూడ మనకు నేర్పించడం జరిగింది.

**లా ఇలాహా ఇల్లాల్లాహుల్ అజీముల్ హలీమ్ – లా ఇలాహా ఇల్లల్లాహు రబ్బుల్ అర్షిల్ అజీమ్ – లా ఇలాహా ఇల్లల్లాహు రబ్బుస్సమావాతి వ రబ్బుల్ అర్జి వ రబ్బుల్ అర్షిల్ కరీం.**

(సహి బుఖారి, కితాబు ద్దావత్, బాబుద్దుఆ ఇందల్ కర్బ్, హదీస్ 6346)

హ్రజత్ ఇబ్న్ అబ్బాస్ రజి ఇలా వివరించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కష్ట సమయాల్లో ఈ క్రింది విధంగా దుఆ చేసేవారు. "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేదు. అతడు శక్తిమంతుడు, సహనశీలుడు. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. అతడే అద్భుతమైన సింహాసనానికి ప్రభువు. అల్లాహ్ తప్పమరో ఆరాధ్య దైవం లేదు. అతడే భూమ్యాకాశములకు ప్రభువు. మరియు వాటి గొప్ప సింహాసనానికి ప్రభువు."

మరల పరీక్షల సమయంలో చేయునట్టి ఒక దుఆ గలదు. హ్రజత్ అబూ హురైర రజి ఇలా తెలిపారు.

**కాన రసూలుల్లాహి యతఅవ్వజు మిన్ జహదిల్ బలాఇ వ దరకిష్షిఖాఇ వ సూఇల్ ఖజాఇ వ షమాతతిల్ ఆఅదాఇ.** (సహి బుఖారి, కితాబు ద్దావత్, బాబ్ త్తౌవూజు మిన్ జహదిల్ బలాఇ హదీస్ 6347)

హ్రజత్ అబూ హురైర రజి ఉల్లేఖన ప్రకారం, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బాధల నుండి, దౌర్భాగ్యం నుండి, చెడు సంఘటనల నుండి మరియు శత్రువుల సంతోషం నుండి అల్లాహ్ ఆశ్రయం పొందడం కోసం దుఆలు చేసేవారు.

ఈ ప్రపంచంలోని చెడుల నుండి రక్షించబడుటకు ఒక దుఆ గలదు.

اَللّٰهُمَّ اِنِّیۡ أَعُوذُبِكَ مِنَ الْبُخْلِ وَأَعُوذُبِكَ مِنَ الْجُبْنِ وَأَعُوذُبِكَ مِنْ أَنْ نُرَدَّ اِلَى أَرْزَلِ الْعُمُرِ وَأَعُوذُبِكَ مِنْ فِتْنَةِ الدُّنْيَا وَعَذَابِ الْقَبْرِ۔

(సహి బుఖారి, కితాబు ద్దావత్, బాబ్ అత్తౌవూజ్ మిన్ ఫితనతి ద్దునియా, హదీస్ 6390)

ముస్అబ్ బిన్ సాద్ బిన్ అబీ వక్కాస్‌రజి తన తండ్రిని ఆధారం చేసుకొని ఈ విధముగా ఉల్లేఖించారు. "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం మాకు ఈ దుఆలను ఎవరైనా చదవడం మరియు వ్రాయడంను ఎలా నేర్పించుతారో అదే విధముగా మాకు నేర్పించేవారు. చదవడం, వ్రాయడం నేర్పించడం జరుగుతుందో ఆ విధముగా మాకు గుర్తుండిపోయే వరకు నేర్పించేవారు. హుజూర్ (స) నేర్పించిన దుఆ ఏమిటో చూద్దాం!. 'ఓ అల్లాహ్!, నేను లోభితనం నుండి నీ శరణు కోరుతున్నాను, నేను పిరికితనం నుండి నీ శరణు కోరుతున్నాను, నేను నా జీవితం అధ్వానంగా మారిపోవడం నుండి నీ శరణు కోరుతున్నాను, ఈ ప్రపంచపు కష్టాలలో మునిగిపోవడం నుండి నీ శరణు కోరుతున్నాను మరియు సమాధి యొక్క శిక్ష నుండి నీ శరణు కోరుతున్నాను. ఇది చాలా సమగ్రమైన దుఆ.

మరల మార్గదర్శకత్వం కోసం ఒక దుఆ గలదు.

కథనం యొక్క అనువాదం ఇలా గలదు. ఇమ్రాన్ బిన్ హుస్సేన్ రజియల్లాహు తాలా ఇలా పేర్కొన్నారు. "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నా తండ్రి హుస్సేన్‌తో "మీరు ఇస్లాంను అంగీకరించినట్లయితే, మీకు ప్రయోజనం చేకూర్చే రెండు విషయాలను నేను మీకు నేర్పిస్తాను." అని అన్నారు. వారు ఇలా తెలిపారు. హుస్సైన్ ఇస్లాంను స్వీకరించిన తరువాత వారు ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ (స)! మీరు నాతో చేసిన వాగ్దానం మేరకు నాకు ఆ రెండు విషయాలను నేర్పించండి". అప్పుడు ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా నేర్పించారు.

**అల్లాహుమ్మా అల్‌హిమ్‌నీ రుష్దీ వ అఇజ్‌నీ మిన్ షర్రి నఫ్సీ.**

"ఓ అల్లాహ్! నాకు నా మార్గదర్శపు మార్గములను గూర్చి దైవవాణితో తెల్పుము. మరియు నా మనస్సు యొక్క చెడుతత్వం నుండి నన్ను రక్షించుము."

**(సునన్ తిర్మిజి, అబ్వాబు ద్దావత్, బాబ్ ఖిస్సతు తాలీముద్దుఆ.. హదీస్ 3483)**

ఈ రోజుల్లో కూడ ఈ దుఆను చాలా ఎక్కువగా చదవవలెను. శత్రువుల దుష్టత్వములకు భిన్నమైన దుఆ కూడ గలదు.

**అల్లాహుమ్మా ఇన్నా నజ్‌అలుక ఫీ నుహూరిహిం వ నవూజుబిక మిన్ షురూరిహిం.**

(సునన్ అబూ దావూద్, కితాబుల్ వితర్ బాబ్ మా యఖూలు ఇజా ఖాఫ ఖౌమన్ హదీస్ 1537)

హ్రజత్ అబూ బుర్దా బిన్ అబ్దుల్లాహ్ రజి ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడైన ఏ జాతి నుండి ఏదైన ప్రమాదాన్ని గ్రహించినచో, "ఓ అల్లాహ్! మేము నిన్ను మా శత్రువులకు వ్యతిరేకముగా మా కవచముగా మార్చుకొందుము. మరియు వారి దుష్టత్వముల నుండి నీ శరణు వేడుకొంటున్నాము" అని దుఆ చేసేవారని నా తండ్రి నాకు ఈ విషయాన్ని తెల్పినాడు.

ఈ రోజుల్లో, అహ్మదీయులు కూడా ఈ దుఆను ఎక్కువగా చదవాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రత్యర్థుల చెడు నుండి మనల్ని రక్షించుగాకా!.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మనకు బోధించిన దుఆలను ఇప్పుడు నేను ప్రస్తావిస్తాను. ఇందులో ప్రార్థనకు సంబంధించి కొన్ని ఉపదేశాలున్నాయి, మరికొన్ని దుఆలు ఉన్నాయి. దైవ సామీప్యతను పొందు మార్గమేది?, ఏ విధముగా మనం అల్లాహ్ తాలా వైపు మన మనస్సును కేంద్రీకరించగలము? అని మౌల్వీ నజీర్ హుస్సేన్ సఖా దిహల్వీ గారు తమ ఒక లేఖను హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సన్నిధికి పంపారు. అందుకు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా సమాధానమిచ్చారు. "అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహి వబర్‌కాతహు. పద్ధతి ఏమిటనగా, నమాజ్‌లో మీరు మీ కోసం దుఆలు చేసుకోండి. సాధారణంగా మరియు అజాగ్రత్తగా చేయు ప్రార్థన పట్ల సంతృప్తి చెందకండి. సాధ్యమైనంత వరకు ఎక్కువ శ్రద్ధతో నమాజ్‌ను చదవడానికి ప్రయత్నించండి. ఒకవేళ అయినా కూడ మీరు మీ దృష్టిని కేంద్రీకరించలేకపోతే, ప్రతి ఐదు నమాజ్‌లలో, ప్రతి రకాహ్ తర్వాత లేచి నిలబడి ఈ దుఆను చేయండి!." అంటే నమాజ్‌లో నిలబడి ఉన్న స్థితిలో. "ఓ అల్లాహ్! ఓ సర్వశక్తిమంతుడైన దైవమా! నేను పాపిని, ఎంతగా అంటే పాపపు విషం నా హృదయంలోకి మరియు నా నరనరాలలోని ప్రతి అణువులోకి చొచ్చుకుపోయింది మరియు నేను భక్తిభావంను పొందలేకపోతున్నాను మరియు ప్రార్థనలో దృష్టి పెట్టలేకపోతున్నాను. నీ దయ మరియు కరుణతో, నా పాపాలను క్షమించు మరియు నా తప్పులను మన్నించు. నా హృదయాన్ని మృదువుగా చేసి, దానిలో నీ గొప్పతనాన్ని, భయాన్ని, ప్రేమను నెలకొల్పుము, తద్వారా నా కఠిన హృదయం కరిగిపోతుంది, అప్పుడు నేను నమాజ్‌లో దృష్టిని పెట్టగలుగుతాను."

**(మక్తూబాత్–ఎ–అహ్మద్ సంపుటి. 5, పేజి. 471, ఎడిషన్ 2015)**

నమాజ్‌లో మనస్సు కేంద్రీకరించబడుటకు కూడ సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు దుఆ చేయాలి.

మరొక చోట హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ దుఆను తెలిపారు. "ఓ నా శ్రేయోభిలాషి, ఓ నా దేవా!, నేను నీకు పనికిరాని సేవకుడను, పాపాత్ముడను మరియు నిర్లక్ష్యపరుడను. నేను తప్పు తర్వాత తప్పు చేయడం నీవు గమనించావు, అయినప్పటికీ నాపై అనుగ్రహం తర్వాత అనుగ్రహంను కురిపించావు. పాపం తర్వాత పాపాన్ని గమనించావు, అయినప్పటికి ఉపకారంపై ఉపకారం చేశావు. పీవు ఎల్లప్పుడూ నా తప్పులను కప్పిపుచ్చావు. మరియు నీ లెక్కలేనన్ని శుభములను నాకు అందించావు. ఇప్పుడు కూడా, నాలాంటి అసమర్థుడు మరియు పాపాత్ముడిపై దయ చూపుము. నా నిస్సహాయతను, నా అవిధేయతను క్షమించుము. ఈ దుఃఖం నుండి నన్ను నీవే రక్షించుము, ఎందుకంటే నీవు తప్ప మరెవరు రక్షించువారు లేరు. అమీన్." **(మక్తూబాతే–అహ్మద్, సంపుటి 2, పేజి. 10)**

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

నా అభిప్రాయం ప్రకారం, ఇది మనం రోజూ చదవాల్సిన దుఆ. మనల్ని మనం విశ్లేషించుకోవాలి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజియల్లాహ్ తాలా కొరకు రాసిన లేఖలో హుజూర్ (అ) ఈ దుఆను రాశారు. వారి స్థాయిని మరియు ఔన్నత్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ దుఆను చదవడం మనకు ఎంత అవసరమో మనం ఆలోచించాలి. ఈ దుఆను హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ రజికు వ్రాసినట్లయితే, మనం ఈ దుఆను మరింత ఎక్కువగా మరియు పూర్తి శ్రద్ధతో చదవాలి. నిండు మనస్సుతో చేసిన దుఆ, అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆశీర్వాదాలను పొందునట్లు చేస్తుంది.

మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఒక దుఆ గలదు. ఇది హుజూర్ (అ) అల్లాహ్ పట్ల వినయం మరియు భయాన్ని ప్రతిబింబించడమే కాకుండా, మన స్వంత పరిస్థితులను మనం విశ్లేషించుకోవాలని కూడా ఇది గుర్తు చేస్తుంది. ఆ దుఆ ఈ విధంగా ఉంది:

“ఓ సకలలోకాల సంరక్షకుడా! నీ ఉపకారాలన్నింటికి నేను కృతజ్ఞతలు తెలుపలేను. నీవు చాలా దయగలవాడవు, కరుణా ప్రపూర్ణుడవు. నీవు నాకు లెక్కలేనన్ని అనుగ్రహాలను అనుగ్రహించావు. నేను నాశనం కాకుండా ఉండడం కోసం నా పాపాలను క్షమించుము. నాకు పునర్జీవనం లభించుటకై నా మనస్సులో నీ స్వచ్ఛమైన ప్రేమను నింపుము. నా లోపాలను కప్పిపుచ్చుము. నీ ఆనందానికి కారణమయ్యే అటువంటి కార్యాలు చేయడానికి నాకు భాగ్యమును కల్పించుము. నీ శిక్ష నాపై పడకుండా ఉండేందుకు నేను నీ శ్రేష్ఠమైన ముఖాన్ని శరణు వేడుకుంటున్నాను. దయ చూపించు, దయ చూపించు, దయ చూపించు. ఇహపరలోకంలోని విపత్తుల నుండి నన్ను రక్షించుము. దయానుగ్రహాలన్నియు నీ చేతిలోనే ఉన్నాయి. అమీన్.”

**(మల్ఫూజాత్, సంపుటి 1, పేజి 235, ఎడిషన్ 1984)**

మరల పైగామ్-ఎ-సులహ్ (శాంతి సందేశం) ప్రారంభంలో హుజూర్ (అ) వ్రాసిన ఒక దుఆ ఉంది, దానిని మనం విపరీతంగా చదవాలి. హుజూర్ (అ) ఇలా తెలిపారు.

“ఓ నా సర్వశక్తిమంతుడైన దేవా!, నా ప్రియమైన మార్గదర్శి! నీతిమంతులను, చిత్తశుద్ధి గలవారిని నీ వైపుకు నడిపించే మార్గాన్ని మాకు చూపుము. మరియు మానవ తుచ్ఛ కోరికలు, ద్వేషం, ఈర్ష్యా మరియు ప్రాపంచిక కోరికలకు దారితీసే మార్గంలో నడవకుండా మమ్మల్ని రక్షించుము.”

**(పైగామే సులహ్, రూహానీ ఖజాయిన్ సంపుటి 23, పేజి. 439)**

మరో మాటలో చెప్పాలంటే, మనం ఎల్లప్పుడూ మన విశ్వాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

మరొకచోట మనకు మార్గదర్శకత్వం చేస్తూ హుజూర్ (అ) ఇలా అన్నారు:

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రసన్నతను కోరుకునేది మరియు పాపం నుండి రక్షణ కల్పించేదియే అత్యంత అద్భుతమైన దుఆ, ఎందుకంటే పాపం ద్వారా హృదయాలు కఠినపడతాయి మరియు మానవుడు ప్రపంచానికి బానిస అవుతాడు. ఓ అల్లాహ్! మా హృదయాలను కఠినతరం చేయునట్టి పాపముల నుండి మమ్ములను దూరం చేయమని మరియు నీ ప్రీతికి అనుగుణమైన మార్గంలో మమ్ములను నడిపించుము అని దుఆ చేయాలి. ”

**(మల్ఫూజాత్ సంపుటి 7, పేజి 39, ఎడిషన్ 1984)**

మరల హుజూర్ (అ) గారి మరొక దుఆ గలదు.

“మేము నీ పావవు ప్రాణులము మరియు మా మనస్సు మాపై ఆధిపత్యమును వహిస్తున్నది. నీవే మమ్ము క్షమించుము. మరియు పరలోక బాధల నుండి మమ్మల్ని రక్షించుము.

**(బదర్ పత్రిక, సంపుటి 2, పేజి 30)**

ప్రపంచం సంస్కరించబడాలనే బాధలో హుజూర్ (అ) చేసిన ఒక దుఆ ఇలా గలదు.

“ఓఅల్లాహ్!, సర్వశక్తిమంతుడా! నీ సాంప్రదాయం, నీ అలవాటు ఏమిటనగా, నీవు పిల్లలకు మరియు నిరక్షరాస్యులకు బుద్ధిని ప్రసాదిస్తావు మరియు ప్రాపంచిక తత్వవేత్తలు మరియు వివేకవంతుల కన్నులను మరియు హృదయాలను కఠిక చీకటితో కూడిన పరదాలతో కప్పి ఉంచుతావు. కాని నేను నీ సన్నిధిలో ఎంతో వినయంతో అభ్యర్థించుకొనుచున్నాను. అలాంటి వారిలో నుండి కూడ కొంత మందిని మా వైపు ఆకర్షింపబడునట్లు చేయుము. ” అనగా గొప్ప గొప్ప విద్యాంసులను, ప్రజలను మన జమాఅత్‌లో చేర్పించుము. “ నీవు ఇప్పటికే కొందరిని తీసుకవచ్చావు. చూడడానికి వారికి కన్నులను, వినడానికి వారికి చెవులను మరియు అర్థం చేసుకోవడానికి వారికి మనస్సును ప్రసాదించావు. నీవు సమయానుకూలంగా అవతరింపజేసిన ఈ అనుగ్రహాన్ని ” అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరించడం, ఆగమనం, “ గౌరవిస్తూ, దానిని పొందడానికి ప్రత్యేక శ్రద్ధను కేంద్రీకరించునట్లు చేయుము. ఒకవేళ నీవు కోరుకున్నచో అలా చేయగలవు. ఎందుకంటే మీకు అసాధ్యమైనది ఏదీ లేదు. అమీన్.”

**(ఇజాలే ఔహమ్, రూహానీ ఖజాయిన్, సంపుటి 3, పేజి. 120)**

నేటి రోజులలో కూడ మనం ఈ దుఆను హుజూర్ (అ)ను అనుసరించడం కోసం చేస్తుండాలి.

ప్రపంచం, ప్రత్యేకించి ముస్లిం సమాజం తమను తాము సంస్కరించుకుని, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను స్వీకరించుటకు శ్రద్ధ చూపినచో వారు తమ పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలరు. అంతేగాకా వారు నేడు ప్రపంచంలో ఎదుర్కొంటున్న అవమానాలు మరియు అవహేళనల నుండి రక్షించ బడతారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మన నాయకులకు మరియు పండితులకు బుద్ధిని ప్రసాదించుగాకా!. , వారిలో కొందరు సద్గుణ ప్రవృత్తి గలవారు తప్పకుండా ఉంటారు, అల్లాహ్ వారిని ఈ జమాఅత్‌తోకి తీసుకవచ్చును గాకా!. కాబట్టి, మనం ఈ దుఆను గొప్ప భక్తితో మరియు శ్రద్ధతో పఠించాలి.

హజ్రత్ నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ సాహిబ్ రజికు రాసిన లేఖలో హుజూర్ (అ) ఈ దుఆను వ్రాసినట్లు ప్రస్తావించబడింది. “ ఎక్కువగా దుఆలు చేస్తూ ఉండుము, వినయాన్ని ఒక ముఖ్యమైన లక్షణంగా మార్చుకొనుము. ఎవరైనా కేవలం అలవాటు లేదా ఆచారం ప్రకారం నోటితో దుఆలు చేస్తున్నచో అది వ్యర్థం.” కేవలం ఆచారం లేదా అలవాటుగా ప్రార్థించే ప్రార్థనకు విలువ ఉండదు. “ప్రార్థనల విషయానికొస్తే, కేవలం నమాజ్‌లలోనే కాకుండా, ఇతర సమయాలలో కూడ ఏకాంతంలోకి వెళ్లి తన స్వంత భాషలో అత్యంత వినయంతో వేడుకోవడం అలవాటు చేసుకోవాలి. ”అంటే విధిగావించబడిన నమాజ్‌లే కాకుండా, నవాఫిల్ నమాజ్‌లు కూడ చేయాలి. “ ఒక అల్పమైన జీవి సర్వశక్తిమంతుడైన దేవుని రాజ దర్బారులో ఈ క్రింది విధంగా ప్రార్థిస్తున్నట్లుగా వినయంతో ప్రార్థనలు చేయండి: “ఓ సకల లోకాల సంరక్షకుడా! నీ ఉపకారాలన్నింటికి నేను కృతజ్ఞతలు తెలుపలేను. నీవు చాలా దయగలవాడవు, కరుణా ప్రపూర్ణుడవు. నీవు నాకు లెక్కలేనన్ని అనుగ్రహాలను అనుగ్రహించావు. నేను నాశనం కాకుండా ఉండడం కోసం నా పాపాలను క్షమించుము. నాకు పునర్జీవనం లభించుటకై నా మనస్సులో నీ స్వచ్ఛమైన ప్రేమను నింపుము. నా లోపాలను కప్పిపుచ్చుము. నీ ఆనందానికి కారణమయ్యే అటువంటి కార్యాలు చేయడానికి నాకు భాగ్యమును కల్పించుము. నీ శిక్ష నాపై పడకుండా ఉండేందుకు నేను నీ శ్రేష్ఠమైన ముఖాన్ని శరణు వేడుకుంటున్నాను. దయ చూపించు, దయ చూపించు, దయ చూపించు. ఇహపరలోకంలోని విపత్తుల నుండి నన్ను రక్షించుము. దయానుగ్రహాలన్నియు నీ చేతిలోనే ఉన్నాయి. అమీన్.”

**(మక్తుబాతే అహ్మద్, సంపుటి 2, పేజీలు. 158-159, ఎడిషన్ 2015)**

ఈ దుఆలు ఆమోదం పొందాలంటే, మనం ఎక్కువగా దరూద్ షరీఫ్‌ను చదువుతూ ఉండడం చాలా ముఖ్యం. దరూద్ లేకుండా చేసిన మన దుఆలు గాలిలో తేలుతూ ఉంటాయి. అవి అల్లాహ్ వరకు చేరుకోలేవు. కావున మనం దరూద్ షరీఫ్‌ను ఎక్కువగా చదువాలి.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى آلِ مُحَمَّدٍ، كَمَا صَلَّيْتَ عَلٰى إِبْرَاهِيْمَ، وَعَلٰى آلِ إِبْرَاهِيْمَ، إِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ، اَللّٰهُمَّ بَارِكْ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى آلِ مُحَمَّدٍ، كَمَا بَارَكْتَ عَلٰى إِبْرَاهِيْمَ، وَعَلٰى آلِ إِبْرَاهِيْمَ إِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔

మనం ఈ దరూద్ షరీఫ్‌ను విపరీతంగా పఠించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు మనస్ఫూర్తిగా దుఆలు చేసే అవకాశాన్ని ప్రసాదించుగాకా!. తమ స్వంత భాషలలో కూడా దుఆలు చేయాలి. నిండు మనస్సుతో, నిజమైన తపనతో, నమ్మకంతో దుఆలు చేయుభాగ్యము లభించుగాకా!. రంజాన్ శుభములు మనకు శాశ్వతంగా ఉండేలా దుఆలు చేయండి. ఈ శుక్రవారం మరియు తదుపరి అన్ని శుక్రవారాల శుభములను కూడ మనం పొందువారము కావలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించినందున ఖైదీ చేయబడిన అహ్మదీయుల విడుదల కోసం దుఆలు చేయండి. వారు పాకిస్తానీయులైనను, యమన్ దేశస్థులైనను, ఇతర ప్రాంతాలకు చెందినవారైనను, అల్లాహ్ తాలా వారందరిని త్వరగా విడుదల చేయు మార్గములను తెరుచుగాకా!. దుష్టుల దుష్టత్వములపై వారిపైనే తిరిగి పడును గాకా!, మనం మరియు మన సంతానం యుద్ధపు అగ్ని జ్వాలల నుండి రక్షించబడుటకు మరియు యుద్ధ పర్యవసానాల నుండి సురక్షితముగా ఉండుటకు చాలా దుఆలు చేయాలి. అల్లాహ్ తాలా మనలను వాటి నుండి కాపాడుగాకా!

యుద్ధం మన దరిదాపుల్లో ఉన్నట్లు ఇప్పుడు అనిపిస్తోంది, వాస్తవానికి, ఇది ఇప్పటికే ప్రారంభమైంది. ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది, అయినప్పటికీ, ప్రపంచ నాయకులు కొంచెం కూడా ఆందోళన చెందడం లేదు. వారు సురక్షితంగా ఉంటారని మరియు సాధారణ పౌరులు నశిస్తారని వారు భావిస్తారు. అయితే ఇది వారి ఊహల కల్పన.

తమ ఆధిపత్యమునకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వారికి ప్రజలను గూర్చిన ఎలాంటి చింతనయే లేదు. ఇవి దజ్జాల్ ఎత్తుగడలు, మేము మీకు ఇవి చేస్తాం, అవి చేస్తాం అని ప్రజలను తమ గుప్పెట్లోకి తీసుకొని వారిని మోసం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ నిరసనలను ప్రారంభించారు. కానీ వారి కుయుక్తులు ప్రజలను దేవుని నుండి దూరం చేశాయి. వారు అప్పటికే దేవునికి దూరంగా ఉన్నారు. ఇంకా, అసభ్యత మరియు చెడు హద్దులు మీరిపోతుంది. ఇది కూడ అల్లాహ్‌కు ఇష్టముండదు. పర్యవసానమేమిటంటే, వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆగ్రహానికి గురి అవుతారు. ఇలాంటప్పుడే అహ్మదీయులు సర్వశక్తిమంతుడైన దేవునికి దగ్గరయ్యేందుకు మరియు చింతనతో, భక్తితో దుఆలు చేయడం చాలా ముఖ్యం. అప్పుడే మనం వారి చెడు నుండి రక్షించబడుతాము. . వారిలో ఉన్న సత్యస్వభావులు కూడ వారి దుష్టత్వముల నుండి కాపాడబడుటకు, వారిలో ఉన్నటు వంటి మంచివారు, కూడ వారినాయకుల చెడు నుండి కాపాడబడుటకు దుఆలు చేయవలెను.

నేను ముందుగా చెప్పినట్లుగానే, ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. యుద్ధం పాలస్తీనా సరిహద్దుల నుండి ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. సిరియాలోని ఇరాన్ కాన్సులేట్‌పై జరిగిన దాడిని ఏ చట్టం ప్రకారం చూసిన ఘోరమైన నేరంగానే కనిపిస్తుంది. అయితే ఈ దాడి ఇజ్రాయెల్ చేసింది కావున ప్రపంచం మొత్తం మౌనంగా ఉండిపోయింది. ఇప్పుడు దీని ఫలితంగా యుద్ధం పరిధి విస్తృతమవుతుంది. సహాయక సిబ్బందిని హత్య చేయడంతో కలకలం రేగింది మరియు కొందరు వ్యక్తులు దీనికి వ్యతిరేకంగా మాట్లాడటం ప్రారంభించారు. కానీ అమాయక పాలస్తీనియన్ల హత్య విషయంలో మాత్రం మౌనంగా ఉన్నారు. తమ వాళ్ళు హత్యకు గురైనారని వారు ఇప్పుడు బాధపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవాళిని రక్షించుగాకా!. మరియు మనకు దుఆల హక్కులను చెల్లించు భాగ్యమును కల్పించుగాకా!. ఆమీన్.

---

**(1వ పేజి తరువాత తఫ్సీరే కబీర్)**

అనగా కొనసాగుతున్న విధానాలను వీడి నూతన విధానాలను అనుసరించాలని ప్రవక్తలు చెప్పడం.

అవిశ్వాసులు ఇలా రెండు రకాల భిన్నమైన నడవడికలను నడుస్తుంటారు. ఒకవైపు వారు "తమ సంస్కరణ కోసం తమ జాతిలో నుండి ఎవరు అవతరించరు"అని భావించే అంతటి నిరాశ, నిస్పృహలకు లోనవుతూనే, మరోవైపు తమ విధానాలను ఎందుకు మారుస్తున్నారు అని పోరాడుతుంటారు. అణగారిన జాతుల దుస్థితి ఇలాగే ఉంటుంది. దేనిని విడిచిపెట్టు కోకుండానే, ఏమి చేయకుండానే, ఒక వ్యక్తి ఇతర జాతి నుండి వచ్చి, వారు కొనసాగిస్తున్న విధానాలను అనుసరిస్తూనే , అదికూడ వారు ఏమి నేర్చుకోకుండానే, ఏమి కష్టపడకుండానే, ఎలాంటి కృషి చేయకుండానే, ఏ విధమైన చెడు అలవాట్లను వదిలి వేయకుండానే వారిని ప్రగతి పథంలోకి తీసుకవెళ్ళాలి అని వారు ఆశిస్తుంటారు. ఒక వ్యక్తి ఇతర జాతి నుండి వచ్చి, ఇతర మతస్థులందరిని చంపివేసి, వారికి అన్నింటిని సమకూర్చాలని కూడ వారు భావిస్తుంటారు. కాని ఒకవేళ వారు అనుసరిస్తున్న విధానాలు సరైనవే అయినచో మరి ఎందుకు వారు క్షీణిస్తున్నారు?, ఎందుకు వారు ఓటమిని చవిచూస్తున్నారు? అని మాత్రం ఎన్నడు ఆలోచించరు. నిజానికి వారు అనుసరిస్తున్న వారి విధానాలను మార్చినప్పుడే వారికి విజయం లభిస్తుంది.

**(తఫ్సీరే కబీర్, సంపుటి 3, పేజి 16, ప్రచురణ 2010, ఖాదియాన్)**

---

ఈ భూమండలంపై దేవుని సామ్రాజ్యం మరియు అతని చక్రవర్తిత్వం గలదు. కావున ఈ భూమండలంపై అతని రబూబియత్ (సంరక్షణ) గలదు, అతని రహ్మానియత్ (కరుణా) గలదు, అతని రహీమియ్యత్ (దయాగుణం) గలదు. ఆపై సహాయము నందించు పరంపర కూడ గలదు. శిక్షించు పరంపర కూడ గలదు. ఒక విధముగా చెప్పదలచినచో ఒక చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలన్ని ఈ భూమండలంపై దేవుని పరిపాలనలో మనకు కనిపించును. ఒక్క అణువు కూడ అతని ఆదేశం నుండి బయటలేదు. అన్ని ఫలాలు అతని ఆధినములోనే ఉన్నవి. అన్ని కరుణలు అతని చేతులలోనే ఉన్నవి.......... కావున వినండి, అర్థం చేసుకోండి, ఇందులోనే గొప్ప విజ్ఞత ఉంది. ఏ విధముగానైతే ఆకాశపు అణువణువు దేవుని చక్రవర్తిత్వంలో ఉన్నదో అదే విధముగా భూమండలపు అణువణువు కూడ దేవుని ఆధీనంలో, అధికారంలో ఉన్నది. ఏ విధముగానైతే ఆకాశంలో అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నదో అదే విధముగా ఈ భూమండలంపై కూడ అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నది. ఆకాశపు ప్రాచుర్యం ఒక విశ్వాస ప్రక్రియ. సాధారణ వ్యక్తులెవరు ఆకాశముపైకి వెళ్ళి అతని వీక్షించలేదు. కాని భూమండలంపై దేవుని చక్రవర్తిత్వపు ప్రాచుర్యం గలదు. ఇది ప్రతి ఒక్కరి కన్నులకు ఎంతో స్పష్టముగా కనుపించును.

## హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి అమెరికా, గోయిటెమాలా పర్యటన నివేధిక:-

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు: అల్లాహ్ తఆలా కృపానుసారము అమెరికా, గోయిటెమాలా పర్యటనల వలన ఎన్నో సానుకూల ప్రభావములు వెలువడుతాయి. తమవారితో పాటు ఇతరులతో ఏర్పడు అనుబంధములు మరియు జమాఅత్ వ్యవస్థతో పాటు అనేక విషయములను ప్రత్యక్షంగా చూచినందున వివిధ విషయములను గురించి నాకు కూడ అవగాహన కలుగుతుంది.

మూడూ పెద్ద లాభములు చేకూరును. (1) భేటీలు, మస్జిద్‌ల ప్రారంభోవత్సము లేదా వేడుకలు మొదలగు వాటి ద్వారా ఈ దేశములలో విద్యావంతుల శ్రేణి, పలుకుబడి గల ప్రజలతో సత్సంబంధములు ఏర్పడును. (2) రెండవ విషయము మీడియా ద్వారా ఇస్లాం, అహ్మదియ్యత్ పరిచయం, నిజమైన బోధన ప్రజలకు అందును. (3) మూడవ పెద్ద విషయమేమనగా జమాఅత్ సభ్యులతో వ్యక్తిగత సంబంధము, పరిచయం ఏర్పడును. తద్వారా వారి విశ్వాసము, వినమ్రత వారి మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం పెరిగిపోవును. వర్తమాన ఖలీఫాను జమాఅత్ సభ్యులు ప్రత్యక్షముగా కలుసుకోవడం వలన, చూడడం వలన, సంభాషణలు ఆలకించడం వలన వారిలో అసాధారణమైన మార్పు ఏర్పడుతుంది, మనోభావాలు కూడ పటిష్టమగును. వారి దేశాల పరిస్థితులను బట్టి వారికి ప్రత్యక్షముగా జుమా ప్రసంగాలలో విలువైన సూచనలు ఇవ్వడం జరుగుతుంది.

ఈ పర్యటనలో భాగంగా అమెరికాలో మూడు మస్జిద్‌లను ప్రారంభించు అనుగ్రహము లభించెను. అల్లాహ్ తాలా ఆయా మస్జిద్‌లను నమాజ్ సల్పువారితో ఎల్లప్పుడు నింపియుండును గాక!, జమాఅత్ సభ్యుల విశ్వాసం, వినమ్రతలను పెంపొందించును గాక!. నేను ఎక్కడికి వెళ్ళినా అనగా ఫెలాడెల్ఫియా, హేవోస్టన్, వాషింగ్‌టన్ మొ॥నవి అక్కడి యువకులు, స్త్రీ, పురుషులు తమ అధిక సమయమును మస్జిద్‌లలోనే గడిపినారు. మీరు పర్యటించడం వలన త్వరత్వరగా మస్జిద్‌కు చేరుకోవాలని పిల్లలు పదే పదే హంగామా చేసేవారని పిల్లల తల్లిదండ్రులు, ఇతర బంధువులు నేటికి కూడ నాకు లేఖలు వ్రాస్తున్నారు. దీనితో ఖిలాఫత్‌తో వారికి గల అనుబంధము బహిర్గతమయ్యేది. అందుకే వారు మస్జిద్‌నకు వచ్చి అధిక సమయము మస్జిద్‌లోనే గడిపేవారు.

ఈ సంవత్సరము అమెరికాలో పౌరసత్వం పొందుటకు, మరియు వలస వాదులుగా చేరుకున్న వారిలో పాకిస్తాన్ అహ్మదీయుల సంఖ్య అధికముగా ఉన్నది. వీరందరు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, నేపాల్ మొ॥లగు దేశాల నుండి ఇక్కడికి చేరుకున్నారు. వారిని కలుసుకున్నప్పుడు మనస్సు ఎంతో ఉద్వేగంనకు గురిఅవుతుంది.

అల్లాహ్ తాలా వీరందరికి ఇక్కడ సౌకర్యాలు కల్పిస్తూనే ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నివ్వాలనే ఆలోచన ఎల్లప్పుడు అధికముగా ఏర్పడునట్లు, మరియు ఈ రంగుల ప్రపంచములో తలమునకలు కాకుండా చేయుగాక!

నేనిప్పుడు పర్యటనలను గూర్చి ప్రస్తావించెదను. నిజానికి అమెరికా రాజకీయ నాయకులు , విద్యావంతల శ్రేణి, సామాన్య ప్రజలు కూడ అధికశాతం మంచి విషయమును విని ప్రోత్సహింతురు. ఇస్లాం స్వచ్ఛమైన బోధన వారికి చేరలేదు. సందేశము అందినవారు, జమాఅత్‌తో సంబంధము గల వారు ఇస్లాం గురించి సదాభిప్రాయం కలిగివున్నారు. కావున ఇస్లాం స్వచ్ఛమైన సందేశమును అమెరికాతో పాటు ప్రపంచములో కూడ సరైన పద్ధతిలో వ్యాపింపజేయుటకు తీవ్రంగా శ్రమించుట మన కర్తవ్యము. ఇస్లాం సందేశము ముస్లిమేతరులకు కనువిప్పు కల్పించడమే గాకుండా, ఇస్లాం సౌందర్యాన్ని, శాంతియుత బోధనలను బహిర్గతమొనర్చును. ఫలితముగా మన సందేశముతో ముస్లిమేతరులకు ఇస్లాం బోధన తెలిసినట్లే అహ్మదీయులు కాని ముస్లిములకు కూడ నిజమైన ఇస్లాంను గూర్చి తెలిసిపోవును. అహ్మదీయులు కాని ముస్లిములు మనతో ఇస్లాం అందమైన బోధనను విన్నప్పుడు మనము ఎలాంటి సంకోచానికి గురి కాకూడదని వారికి కూడ ఆత్మస్థైర్యం లభిస్తుంది. ఇలా చాలా చోట్ల అనుభవం కల్గినది. అమెరికాలో కూడ అనుభవం కల్గినది. ఈ విషయాన్ని వారు కూడ అంగీకరించారు. వాస్తవానికి ప్రపంచ సమస్యల పరిష్కారము ఇస్లాం ద్వారనే లభించును. ఇస్లాం ద్వారనే ప్రపంచ శాంతి సామరస్యతలు నెలకొనును. సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి కూడ ఇస్లాం మార్గం చూపును. ఇస్లాం అందమైన బోధనను మీరు ఎంతో గొప్ప రీతిలో వెల్లడిస్తారని అహ్మదీయులు కాని ముస్లిములు కూడ అభిప్రాయపడ్డారు. ముస్లిమేతరులు ఈ సందేశాన్ని ఆలకించి ఆశ్చర్యమును వ్యక్తపరుస్తారు. పైగా ఇవే ఇస్లాం బోధనలైనచో నిశ్చయముగా ఇస్లాం ధర్మమే విజయం సాధించునని తమ అభిప్రాయాలను కూడ వ్యక్త పర్చుచున్నారు. పలువురు అతిథుల విశ్వాస భరిత అభిప్రాయాలను

ప్రస్తావించెదను.

ఫెలాడెల్ఫియాలో మస్జిద్ బైతుల్ ఆఫియత్ ప్రారంభోత్సవ సమావేశంలో ప్రముఖులు డ్వాయిట్ ఎవన్స్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు. వారు ఎంతో మర్యాదపూర్వకముగా నన్ను ఆహ్వానిస్తూ ఇట్లనిరి. ఈ పెద్ద నగరములో నేను మీకు స్వాగతం పలుకుచున్నాను. అన్నా చెల్లల వంటి ఆప్యాయత గల నగరమిది. ఫెలాడెల్ఫియా పాలక వర్గము తరపున నేను ముస్లిం కమ్యునిటికి చెప్పదలచినదేమనగా మీ శాంతియుత సందేశమునకు స్వాగతం పలుకుచున్నాను. మరల వారట్లనిరి. కొందరు అమెరికన్‌లు గత సంవత్సరము ఇస్లాంకు వ్యతిరేకముగా తమ అభిప్రాయాలను తెల్పినారు. కాని ఇక్కడి అధిక జనాభ మీకు స్వాగతం పలుకుతుందని నేను ఈ సందర్భమున మీకు తెలియజేయుచున్నాను. మేము మీకు తోడుగా వున్నాము. ద్వేషము, అసూయ, తీవ్రవాదమునకు వ్యతిరేకంగా మేము నిలబడినాము. మరల వారు తమ వ్యక్తిగత అభిప్రాయమును తెల్పుచూ ఇట్లనిరి. శాంతిని స్థాపించుకొనుటకు మీరు ఎంతో గొప్ప సందేశమందించిరి. దురదృష్టం కొలది నేడు మేము ఈ అమెరికాలో చీకటి జీవితంను కొనసాగిస్తున్నాము. ఇలాంటి సందర్భములో ఈ సందేశమునకు ఎంతో ప్రాధాన్యత సంతరించును. కావున ముస్లిం కమ్యూనిటి కేవలం అమెరికాకే కాకుండా ప్రపంచ మంతటికి ఎంతో ముఖ్యమో మనకు అర్థమవుతుంది. భవిష్యత్తులో కూడ మనకు నమ్మకం, శాంతియుత జీవనమే కావలెను. ఫెలాడెల్ఫియా లో గల ధార్మిక స్వేచ్ఛ ఎంతో విలువైనది. అంతేగాకా ఫెలాడెల్ఫియాలో అన్ని ధర్మాల వారు స్వేచ్ఛగా వ్యవహరించవచ్చునని గతంలో ఒప్పందం కూడ జరిగినది. ఇదొక అద్భుత అవకాశం. ఈ అవకాశం వలనే మీరు ఇక్కడ ఒక అద్భుత మస్జిద్‌ను నిర్మించుకున్నారు.

ఇవి వారి ఆలోచనలు. అక్కడికి మేయర్ మరియు ఇతర రాజకీయ నాయకులు కూడ వచ్చారు. అనంతరం మేయర్ జాన్ కేని గారిట్లనిరి. మత స్వేచ్ఛ అనేది ఈ నగర ప్రాథమిక సూత్రములలో ఒకటని ఫెలాడెల్ఫియా నగర చరిత్ర మనకు తెలుపుచున్నది. ఈ నగరము దీని ఆధారముగనే నిర్మించబడెను. నిస్సందేహంగా మనము విభిన్న జాతులకు, వంశములకు చెందిన వారమైనను ఈ నగరము ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకును. అందుకే మనము కలిసి మెలిసి పని చేయవలెను, పరస్పరం ఒకరు మరొకరిని గౌరవించుకోవలెను. మనము కలిసి వుండగలమని, మన సమస్యలను, మన పిల్లల సమస్యలను తుది ముట్టించగలమని ప్రపంచానికి చాటి చెప్పుదాం. ఇదే అసలైన ఇస్లాం బోధన. ఈ బోధనలను ఇతరులు అలవర్చుకొనుచుండగా ముసల్మానులు మాత్రం మర్చిపోతున్నారు.

మరల ఈ కార్యక్రమములో ఒక న్యాయమూర్తిగారు హెర్రి షివార్టజ్ పాల్గొన్నారు. వారిట్లనిరి. నేను ఈ జమాఅత్‌ను గత 25 సంవత్సరాలుగా పరిశీలిస్తున్నాను. ఇక్కడి జమాఅత్ అధ్యక్షుల వారితో అనేక సార్లు డిన్నర్‌చేస్తూ కూడ అనేక సమస్యలపై చర్చించుకోవడం జరిగింది. నేను ప్రసంగించిన తరువాత మరల వారిట్లనిరి. ఈ సందేశం ఎంతో ప్రేమానురాగాలతో కూడినది, ఐక్యమత్యమును పెంపొందించునది. ఈ సందేశమును అర్థం చేసుకున్నచో మనమందరము ఎంతో ఆనందముగా జీవించగలము.

మరొక ఆఫ్రికన్ నూతన ముస్లిం సోదరుడు ఇలా తెలిపెను. ఇక్కడ మస్జిద్ చాలా అవసరం. ఇదెంతో చక్కటి కేంద్రముగా ఏర్పడింది. సమాజాన్ని చక్కదిద్దుటకు కనీసం 10 సంవత్సరాలు పడుతుందని చెప్పుకొస్తుంటారు. కాని నేను కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే సమాజం చక్కబడడంను గుర్తించాను. సంకల్ప బలమున్నచో కలసికట్టుగా పని చేయవచ్చునని ఈ అంశమే నిరూపిస్తున్నది. నేను ప్రసంగించిన తరువాత మరల వారిట్లనిరి. ఇదెంతో అద్భుత సందేశం. మీ ప్రతి మాట హృదయమును ప్రభావితం చేసింది. వీరు అహ్మదీయులు కారు, కేవలం ఇస్లాంను మాత్రమే స్వీకరించారు.

మరల ఆఫ్రికాకు చెందిన అమెరికన్ మహిళ తమ అభిప్రాయమును ఇట్లు తెల్పిరి. ఈ ప్రసంగం ద్వారా నేను ఎంతో నేర్చుకోగలిగాను. ఇకపై దీనిని మనమందరం మన జీవిత భాగముగా మల్చుకుంటామని ఆశిస్తున్నాను. ఒకవేళ మనము వీటిని ఆచరించినచో మనము సన్మార్గంలో నడిచిన వారమవుతాము. వీరు కూడ అహ్మదీయులు కారు.

మరల హానియా అనే మహిళ తమ అభిప్రాయమును ఈ విధముగా తెల్పిరి. మీరు అందిస్తున్నటు వంటి ఈ సందేశం ద్వారా ఇస్లాంకు వ్యతిరేకముగా వ్యాపింపజేస్తున్న ద్వేషాన్ని రూపుమాపిన వారగుదురు. ఇక్కడ ముసల్మానుల ఒక కేంద్రము ఏర్పడడం నిజముగా నాకు ఆనందముగా ఉన్నది. ప్రజలలో ఇస్లాం పట్ల ద్వేషం గలదు. ఇది మంచిది కాదు. మీ సందేశం ఆలోచింప జేస్తుంది. ఈ సందేశం విస్తృతముగా విస్తరించాలని ఆశిస్తున్నాను. అమెరికా ప్రజలు ఇస్లాం వాస్తవమును గుర్తించాలి.

ఒక స్థానిక కౌన్సిలర్ మస్జిద్ ప్రారంభోత్సవ కార్యక్రమములో పాల్గొనిరి. వారిట్లనిరి. మీ ప్రేమపూర్వక సందేశం ఎంతో అవసరమున్నది. ప్రస్థుత తరుణంలో మీ శాంతి సందేశము ఎంతో అవసరముండెను. నేను ఇక్కడికి రావడం ఎంతో అదృష్టముగా భావిస్తున్నాను. ఈ మస్జిద్‌ను నా కన్నుల ముందు నిర్మించడంను నేను చూశాను. ఇక్కడ నిర్మించిన ఈ మస్జిద్ ఇక్కడి వారందిరికి శుభములను చేకూర్చుగాక! కనుక ఈ సందేశము చాలా ప్రాముఖ్యతను సంతరించుకొనెను. ఇరుగు పొరుగు వారికి చేదోడు వాదోడుగా వుంటామని మీరిచ్చిన సందేశము ఇక్కడ ఫెలాడెల్ఫియాలోనే కాక అమెరికా మొత్తంలో విస్తరింప జేయవలసిన అవసరమున్నది.

ఫాలస్తీన్ నుండి వచ్చిన ఒక ముస్లిం మహిళ కూడ మన కార్యక్రమములో పాల్గొన్నారు. వారు తమ అభిప్రాయమును ఇట్లు తెల్పిరి. మీ సందేశం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నది. నేను ఫాలస్తీన్‌కు చెందిన ఒక చిన్న గ్రామానికి చెందిన మహిళను. నేను బాల్యంలో నేర్చుకున్న బోధనలను ఈ రోజు మీ ప్రసంగంలో ఆలకించడం జరిగింది. ఇక్కడ ప్రస్తావించబడిన బోధనలే అసలైన ఇస్లాం బోధనలు. మనం ఏ వర్గానికి చెందిన వారమైన శాంతిని స్థాపించుటకై అందరం కలసి కట్టుగా పని చేయాలి. మీరు వాస్తవానికి ముస్లిం తెగలన్నింటికి ప్రాతినిథ్యం వహించారు. సద్భావన కల్గిన వారి అభిప్రాయాలు పై విధముగ గలవు. కాని అహ్మదియ్య జమాఅత్ ఒక్కటే ముస్లిం తెగలకు సరైన విధముగా ప్రాతినిథ్యం వహిస్తున్నదని ఇతర ముస్లింలు కూడ గుర్తించినచో ఎంతో బాగుండును.

మరొక మహిళ ఉపాధ్యాయురాలు తమ అభిప్రాయమును ఈ విధముగ తెలియపర్చిరి. మీ శాంతి సందేశం ఎంతో గొప్పగా ఉన్నది. నేను క్యాథలిక్ తెగకు చెందిన మహిళనైనను మీ ప్రతి ఒక్క మాటను ఏకీభవిస్తున్నాను. ఇస్లాం శాంతి సందేశము నిస్తుందని, మానవత సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని నేను ఈ సందర్భముగ ఖచ్చితముగా చెప్పగలను.

ఒక విశ్వవిద్యాలయపు కులపతి ప్రాతినిథ్యం వహిస్తు మన కార్యక్రమములో పాల్గొన్న ఒక ప్రొఫెసర్ తమ అభిప్రాయాన్ని ఈ విధముగ తెలిపారు. మీరు ఈ పట్టణ ప్రజల ఉజ్వల భవిషత్తు గూర్చి వ్యక్తపర్చిన అభిప్రాయాలు రాబోవు తరాల వారికి ఉపయోగపడును కాని నేటి తరానికి కాదు. కేవలం నేటి సమాజం గూర్చి కాకుండా రాబోవు తరాల గూర్చి సూచనలు ఇవ్వడం, ముందు చూపు కల్గి ఉండడం మీలో ఒక ప్రత్యేకతని నేను గ్రహించాను. ఆ తరువాత వారు నా ప్రసంగంను గూర్చి ఉత్తమ పదజాలలతో కొనియాడారు. మరల వారిట్లనిరి. మీరు ఇక్కడ ఒక భీజంను విత్తారు. దానిని కాపాడుకోవడం, పెంచి పెద్ద చేయడం, దానిని సోదరభావాలు గల ఒక మహా వృక్షముగా తీర్చిదిద్దడం మా అందరి కర్తవ్యం.

మరొక మహిళ తమ మనోభావాలను ఎంతో ఉద్వేగంతో ఇలా వ్యక్తపర్చారు. మీ ప్రసంగ పదాలను కన్నీటితో అద్దుకోవాలి. ఎంత మంది ఇలాంటి ప్రసంగాలను చేయగలరు?. ఇది ఒక అద్భుతం. నేను నా ఉద్వేగంను అదుపుచేసుకోలేక పోతున్నాను. తమ సందేశాన్ని విస్తరింపజేయుటకు గట్టిగా, ఉగ్రూగుతులు ఊగించే విధముగా ప్రసంగించవలసిన అవసరం ఏమి లేదు. మీరు ఆ సందేశంను ఎంతో ప్రేమగా, ఆప్యాయతతో మదిలో ఇమడింపజేశారు. పేదల సహాయం కొరకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉంటామని నేను ముందే చెప్పాను. వారికి ఎలాంటి సమస్య ఉన్న మేము దానిని తీర్చుటకు అన్ని విధాలుగా కృషి చేస్తాము.

ఒక అహ్మదియేతర మస్జిద్ ఇమాం కూడ మన కార్యక్రమములో పాల్గొన్నారు. అహ్మదియ్య జమాఅత్ చేసిన ఖుర్ఆన్ అనువాదం వలన నేను మొదటిసారిగా అహ్మదీయులతో కలిసాను. వారి వద్ద మౌల్వీ ముహమ్మద్ అలి

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

గారి అనువాదం గలదు. మరల వారిట్లనిరి. మీ సందేశం ఎంతో అద్భుతమైనది. నేను నూటికి నూరు శాతం మీతో ఏకీభవిస్తున్నాను. ఇదే మా ధ్యేయం, సంకల్పం. మనమందరం ఆధమ్ సంతానం, కావున మనలో ప్రతి ఒక్కరు ఇతరుల మెరుగైన జీవితం కోసం కృషి చేయాలి. మనమందరం కలసి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సందేశంను వ్యాపింపజేయాలి. అల్లాహ్ తాలా వీరిని కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణకు తోడ్పడే విధముగా అనుగ్రహించు గాక!.

అనంతరం బైతుస్సమద్ పేరున గల బాల్టీమూర్ మస్జిద్ ప్రారంభోత్సవము కూడ జరిగెను. గతంలో ఇదొక చర్చి భవనం, దీనిని కొనుగోలు చేసి, పున:నిర్మాణం చేయించి మస్జిద్‌గా మార్చడం జరిగింది. దైవికముగా ఈ భవన నిర్మాణం పూర్తిగా 99.9% ఖిబ్లా దిశను కలిగి ఉన్నది. అందువలన దీని పున:నిర్మాణంలో అంతగా మార్పు చేయవలసిన అవసరం రాలేదు. అక్కడ నేను ఈ మస్జిద్‌ను గూర్చి వివరముగా ప్రస్తావించలేదు. కావున ఇప్పుడు దాని వివరణలు తెలుపెదను. ఆ భవనం కొనుగోలు కోసం 20 లక్షల డాలర్లను ఖర్చు చేశారు. అందులో పురుషులకు, స్త్రీలకు వేరు వేరు ప్రాంగణములు గలవు. అందులో సుమారు 400 మంది నమాజ్ సలుపెదరు. ఇవియే గాకుండా కార్యాలయాలు, గ్రంధాలయం, తరగతి గదులు, వంటగది, భోజన ప్రాంగణం వంటివి గలవు. జాతీయ రహదారిపై ఈ భవనం గలదు. ఈ రహదారిపై రోజుకు సుమారు 45వేల వాహనాలు ప్రయాణిస్తుంటాయి.

ప్రారంభ వేడుకలో బాల్టీమూర్ మేయర్ కూడ పాల్గొన్నారు. వారిట్లనిరి. మీరు శాంతి గురించి మాట్లాడినారు. నేడు ఈ సందేశము ఎంతో అవసరమైనది. కేవలం మా నగరములోనే కాక మొత్తం రాష్ట్రములో, మొత్తం యు.ఎస్.ఏలో, అనంతరం ప్రపంచమంతటా దీని అవసరము ఎంతో వున్నది. ఈ సందేశమును ప్రతి ఒక్కరు వినవలెనని ఆశిస్తున్నాను. మనము విన్నచో ప్రపంచ సమస్యలకు ఏకైక పరిష్కారం శాంతి అని, మనము పరస్పరం ఒకరినొకరం ప్రేమపూర్వకంగా చూసుకోవాలని మనకు స్పష్టమగును.

ఒక విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ బాల్టిమూర్ మన కార్యక్రమములో పాల్గొని ఇట్లనిరి. మనలో అనేక విభేదాలు ఉన్నప్పటికి అనేక విషయాలలో ఒకే అభిప్రాయమును కల్గి ఉన్నాము. ఇదొక మహా అద్భుతమైన సందేశము. దీని ద్వారా మనము సమాజములో ఒక ముఖ్యమైన మార్పు సృష్టించగలము. మనమందరం కలసి పని చేయాలి, పరస్పరం గౌరవించుకోవాలి. యు.ఎస్.ఏ.సమాజానికి ఈ సందేశము చాలా విలువైనది. మనమందరం అమెరికన్ వారసులమైనందున మనం మనకోసమే కాకుండా మన పిల్లల భవిష్యత్తుకోసం కలసి పని చేయవలసి ఉంటుంది. సమాజంలో అందరం కలసి ముందుకు వెళ్ళవలసి ఉంటుంది. ఈ మహా గొప్ప సందేశము నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది.

48 జిల్లాలకు రాష్ట్ర ప్రతినిధి అయిన ఒక మహిళ అధికారి కూడ మన కార్యక్రమములో పాల్గొనిరి. వారిట్లనిరి. ముసల్మానుల ప్రస్తావనతో సమాజం ఆందోళన చెందుతున్న ఈ ప్రత్యేక పరిస్థితులలో మరియు ఈ దేశంలో చెలరేగుతున్న వంశపారంపర పోటిలో మీ సందేశంను ఆలకించి నేను చాలా ప్రభావితురాలినైయ్యాను. ఇలాంటి పరిస్థితులలో కూడ మీరు మా బాధ్యతల గురించి సూచించినందుకు నేను చాలా ఆనందిస్తున్నాను. అందరిని ప్రేమించు ఎవ్వరిని ద్వేషించకు అని మీరు మాకు చెప్పినారు. ఈ విషయములే మాకు అవసరమున్నవి. ప్రేమ, శాంతి, సమన్యాయం విషయంలో బాల్టిమూర్ ఉన్నత ప్రమాణాలను అవలంభించవలసి యున్నది. ఆ మహిళ ప్రతినిధి భర్త కూడ కార్యక్రమములో పాల్గొన్నారు, వారిట్లనిరి. ఇది చాలా అద్భుతమైన సందేశమని నా భార్య తెల్పినది. అహ్మదియ్య జమాఅత్ ఇమామ్ ఇక్కడ పర్యటించినందున కలిగిన ప్రభావములో మేము సమాజ ఔన్నత్యము కొరకు ఎంత కృషి చేసినా అట్టి ప్రభావం సాధ్యమయ్యేది కాదు.ఈ ముస్లిం కమ్యూనిటి కేవలం ఇక్కడే గాకుండా అమెరికా మొత్తంలో అహ్మదియ్య జమాఅత్ ఒక గొప్ప అదర్శమును నెలకొల్పుతుంది.

ఫాదర్ జో అను ఒక ఫాద్రి గారు కూడ మన కార్యక్రమములో పాల్గొన్నారు. వారిట్లనిరి. మీరు ప్రసంగిస్తున్న సమయంలో మీ ప్రతి పదానికి నేను సంగీభావంను తెల్పుచుంటిని. ఎందుకనగా నేను బాల్టిమూర్‌లోని మస్జిద్‌కు అనేక సార్లు వెళ్లాను. మీరు తెల్పిన విధముగానే గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ఇతర మస్జిద్‌లలో ఆచరించుటను నేను చూశానని పూర్తి నమ్మకముతో తెల్పుచున్నాను. మస్జిద్ అన్ని వర్గాల వారి కోసం తెరచి ఉంచబడింది. నేను అనేక సార్లు జుమ సమయంలో మస్జిద్‌కు వెళ్ళాను. నేను ఇక్కడ ప్రసంగించిన విషయాలన్నింటిని అక్కడ ప్రత్యక్షముగా చూశాను. ఈ విషయాలను ఆలకించినందున నాకు చాలా ఆనందము కల్గినది. ఇక్కడ వివిధ వర్గాలకు చెందిన వారు ఏకమైనారు. శాంతి స్థాపన కోసం చర్చించు కొంటున్నారు. ఈ విషయాలు కేవలం మన పట్టణానికే గాకుండా నేడు ప్రపంచమంతటికి వీటి ఆవశ్యకత చాలా ఉన్నది.

మరొక మహిళ అతిథురాలు తమ అభిప్రాయమును ఈ విధముగా వెల్లడించినది. నేటి పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రసంగం నాకు ఒక గొప్ప సందేశముగా గోచరించినది. ముస్లింలు, ముస్లిమేతరులు, నల్లవారు, తెలుపువారి మధ్య అనేక భేదభావాలు గలవు. వీటన్నింటిని రూపుమాపు మార్గమును మనం అన్వేషించవలెను. ఇది పరస్పరం గౌరవించుకోవడం వలనే సాధ్యమవుతుంది. పొరుగువారిని గూర్చి మీరు ఇచ్చిన వివరణ, పొరుగు వారితో వ్యవహరించవలసిన విధానంను గూర్చి మీరు తెల్పిన విషయాలు నన్ను అబ్బురపరిచాయి. ఈ సందేశము ఆలకించిన పిదప ఇస్లాంను గూర్చి ఇంకా తెలుసకోవాలనే కోరిక నాలో పెరిగిపోయింది. ఇందుకు నేను మీ అందరికి కృతజ్ఞతలు తెల్పుచున్నాను.

41 జిల్లాలకు రాష్ట్ర ప్రతినిధిగా వ్యవహరిస్తున్న బిలాల్ అలీ అనే ముస్లిం అతిథి ఇట్లనిరి. మీరిచ్చిన సందేశము ఇక్కడి ప్రజలందరిలో ప్రతిధ్వనిస్తుంది. పరస్పర ఐక్యత, ఏకాభిప్రాయము, ప్రేమానురాగము, ఆప్యాయత గల వాతావరణము ఏర్పాటు చేయుటకు ఈ సందేశము ఎంతో ముఖ్యమైనది. ఇస్లాం పట్ల గల భయభ్రాంతులను తొలిగించుటకు ఈ సందేశం చాలా దోహదపడును. మీరు సరియైన సమయములో మాకు అనేక సమస్యలకు పరిష్కారము చూపినారు. ప్రత్యేకించి రాజకీయంగా ఇక్కడి పరిస్థితులను చూసినచో వారు చేయు ప్రకటనలు, ప్రయత్నాలు ముసల్మానులకు వ్యతిరేకముగా ప్రజలను రెచ్చగొట్టుచున్నట్లు గలవు. మీరు ఇక్కడికి వచ్చి ఈ విషయాలపై ఎన్నో మంచి సూచనలను ఇచ్చినారు. ఇలాంటి వాతవరణంలో ఎంతో నేర్పుగా, ఆధారభరితమైన సందేశాన్ని అందించాను, విజ్ఞత గల ఏ వ్యక్తి కూడ దీనిని తిరస్కరించలేడు. సమాజంలో శాంతి స్థాపన ఇంత తేలికగా చేయవచ్చునని నేను మీ ద్వారానే తెలుసుకున్నాను. అదేమనగా, ముందుగా తమ తమ గృహాల నుండే దీనిని ప్రారంభించాలి, పొరుగు వారితో సత్ప్రవర్తనతో మెలగాలి. ప్రపంచము మొత్తాన్ని మార్చడానికి బదులు తమతో కలసి మెలసి ఉన్నటువంటి వ్యక్తుల మధ్య ప్రేమను పంచాలి. వారికి అవసరమైన సేవలు అందించాలి. అప్పుడే ప్రపంచములో శాంతి సామరస్యతలు ఏర్పడును. అంతేగాకా సత్యంవైపు ఆహ్వానించమని ఇస్లాం ధర్మం బోధిస్తున్నట్లుగా, తమ నడవడికే అసలైన ఆహ్వానమని మీరు మరో సులువైన మార్గాన్ని చూపారు. బాల్టిమోర్ సమస్యలను అధిగమించేందుకు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సిద్ధమైనది. సమాజములో ఒక సానుకూల పాత్రను పోషించుటకు తమ సంకల్పమును ప్రకటించిన తరుణంలో ఇదొక ఆచరించదగ్గ ఆదర్శం. అల్లాహ్ తాలా జమాఅత్ సభ్యులకు ఇలాంటి సానుకూల పాత్రను పోషించు అనుగ్రహమును కల్పించుగాక!

మష్అల్ అను మరొక అతిథురాలు ప్రెస్‌బేటేన్ చర్చికి చెందినవారు మంత్రి వర్యులు ఇలా తమ అభిప్రాయమును తెల్పిరి. " ఎంతో అద్భుత సందేశం ఇది. మీరు ఐక్యమత్యం, సోదరభావంపై ప్రత్యేక దృష్టిని సారించారు. భయాందోళలను తొలిగించి ప్రేమానురాగాల వైపు శ్రద్ధను చూపారు. ఈ సందేశమెంతో ప్రత్యేకమైనది. మస్జిద్ నిర్మించు లక్ష్యములను గూర్చి మీరు తెలిపిన విషయములు ఆసక్తిని రేకెత్తించాయి. ఆ తరువాత పొరుగువారితో సత్ప్రవర్తనతో మెలుగడం వంటి బోధనలు నాకు క్రొత్తగా అనిపించాయి. క్రైస్తవ మతంలో బోధించినటు వంటి ప్రేమానురాగాల బోధనలే ఇస్లాం ధర్మములో గలవు. కాని మీడియా వారే ఇస్లాంను గూర్చి తప్పుగా ప్రచారం చేస్తున్నారు.

ఒక చరిత్ర కారులైన డాక్టర్ ఫాతిమ గారు తమ అభిప్రాయమును ఈ విధముగా వ్యక్తపర్చిరి. "అమెరికాలో ఇస్లాం" అనే అంశంపై నేను రిసర్చ్ చేశాను. ఈ క్రమంలోనే అమెరికాలో ఇస్లాం చరిత్రను అన్వేషించుటకు నేను చాలా కృషి చేశాను. నేను ధార్మిక పరిశీలకురాలిని కాను, నేను కేవలం ఒక చరిత్రకారురాలిని. ఈ క్రమంలోనే మీరు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్ ఈ కాలంలో ఇస్లాం పునరుద్దరణ కోసం చాలా కృషి చేశారని తెలిపారు. ఇక ఈ కోణంలో కూడ నేను పరిశోధించవలసి యున్నది. ఇకపై నా పరిశోధన కేవలం హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్ అలైహిస్సలాతో వస్సలాం ఒక్కరే గాకుండా పునరుద్దరణకు దోహదపడిన వారి రచనలు, ఉపదేశాలు అని తెలుసుకొన్నందుకు నాకు ఆనందం కలుగుతుంది. మీ సందేశం ఎంతో అమోఘమైనది. ఇస్లాం సద్భావనను మీరు కేవలం ఇతర మతాల వరకే పరిమితం చేయకుండా ఆయా మతాల ప్రజలతో కూడ ఉత్తమముగా వ్యవహరించాలని సూచించారు. ధార్మిక, రూపురేఖల భేదభావాలు లేకుండా అందరు కలసి మెలసి మానవ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలనే మీ ఆలోచన ప్రశంసనీయమైనది. ముసల్మానులమైనందున అనుమానంతో చూస్తుంటారు. ఇలాంటి స్థితిలో ఒక ముస్లిం వ్యక్తి ఇస్లాం బోధనలను నిర్భయముగా బోధించడం ఎంతో విశిష్టతను సంతరించుకొనును.

నవంబర్ 3వ తేదిన వర్జినియాలో కూడ మస్జిద్ ప్రారంభోవత్సము జరిగినది. ఆ మస్జిద్‌కు మస్రూర్ అని నామకరణం చేయడం జరిగినది. ఇది కూడ ఒక చర్చి భవనం. దీనిని కొనుగోలు చేయడమైనది. 17.6 ఎకరాలతో కూడి యున్నది. 5 మిలియన్ డాలర్లతో ఈ ప్రాంతమును కొనుగోలు చేయడం జరిగినది.

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 8. Thursday, 22 AUG 2024 Issue No. 34.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఆపై దీని పున: నిర్మాణం కొరకు మరల 75వేల డాలర్లను ఖర్చు చేయడం జరిగింది. ఈ భవనం కూడ ఖిబ్లా దిశకు అనుకూలంగా ఉన్నది. ఈ భవన విస్తీర్ణం 22,400ల ఫీట్లు. స్త్రీ పురుషుల కోసం రెండు వేరు వేరు ప్రాంగణములు గలవు. వాటిలో 650మంది నమాజ్‌లు సలుపవచ్చును. ఇవియే గాకా కార్యాలయాల కోసం 11 గదులు గలవు. ఒక గ్రంథాలయం, ఒక సమావేశ ప్రాంగణం, ఒక వంటగది కూడ ఈ భవనంలో గలవు.

కోరి స్టోర్ట్ అనే యు.ఎస్.ఏ.రిపబ్లికన్ అభ్యర్థి ఇట్లనిరి. నేను విన్న ఉపన్యాసము ఎంతో ఆకర్షణీయమైనది, వివేకవంతమైనది. ప్రేమించు అందరిని ద్వేషించకు ఎవ్వరిని అనే సందేశమును అమెరికాతో సహా ప్రపంచమంతా అతి శ్రద్ధతో వినవలెను, దానిని ఆచరించవలెను. ప్రపంచ పరిస్థితులు ఆగమ్యగోచరంగా వున్న తరుణంలో మత స్వేచ్ఛ ప్రచారము చేయవలసిన అవసరమున్నది. మీరు దేశ ప్రయోజనమునకు ఎంతో సేవ చేయుచున్నందుకు ఈ మస్‌జిద్ మాకు గర్వ కారణం.

వర్జీనియాకు చెందిన సెనేట్ అభ్యర్థి అయినటువంటి మాట్ వాటర్స్ అను అతిథుడు తన అభిప్రాయమును ఈ విధముగా తెలిపెను. నేను ప్రసంగంను విన్నాను. నేను ఆధ్యాయనం చేయుదును. ఇంటర్‌నెట్ నుండి సమాచారమును సేకరించెదను. ఇస్లాంను గూర్చి నేర్చుకొనుటకు నేను మీ మస్జిద్‌కు పదే పదే వచ్చెదను.

మరొక క్రైస్తవ అతిథుడు ఇలా తెలిపెను. నేటి పరిస్థితులకు అనుకూలముగా మీ సందేశం గలదు. ఇది చాలా అవసరం. నేను శాంతి సందేశమును విన్నాను. చాలా ప్రభావితుడినైనాను, ఆశ్చర్యపోయాను.

మరల 51వ జిల్లాకు చెందిన వర్జీనియా దేశపు ప్రతినిధి తమ అభిప్రాయమును ఈ విధముగా వెల్లడించిరి. ఈ సందేశం ఎంతో అద్భుతమైనది. ఆకర్షించునది. ప్రత్యేకించి నేటి అమెరికా పరిస్థితులకు ఈ సందేశం ఎంతో అవసరం. ప్రేమాభిమానాలు, ఐక్యమత్యము కూడినది మీ సందేశం. తమపై ఇతరులకు ప్రాధాన్యతనిమ్ము, నిస్వార్థముగా సేవ చేయుము. నేటి రాజకీయ పరిస్థితులలో మనకు ఇలాంటి సందేశమే కావలెను. తమపై ఇతరులకు ప్రాధాన్యత నిచ్చు సందేశం చాలా గొప్పది, ఆధ్యాత్మికతో కూడుకున్నది. తమ పొరుగు వారిని పట్టించుకోవడం, ఇతరులకు సౌకర్యాలు కల్పించడం వంటివి చాలా గొప్ప విషయాలు. ఇలాంటి సందర్భాలలో సాధారణముగా వ్యక్తులు గర్వమును ప్రదర్శించెదరు. కాని మీరు మాత్రం ఇతరులకు ప్రాధాన్యతనిమ్మని బోధించారు.

ఒక అతిథి ఎలెక్స్ కేసే ఇట్లనిరి. నేను చాలా ప్రభావితుడినైనాను. నేను హెూలో కాస్ట్ సర్వేయర్‌ను అయినందున నేను ఎంతో ఉద్వేగమునకు గురి అయ్యాను. మీ సందేశము ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఒక్కొక్క అక్షరము నా ఆత్మను సైతం ప్రభావితం చేసింది. మీ ప్రసంగం ఎంతో విజ్ఞతభరితమైనది. విద్వేషముతో మనం పోరాడలేము. ఈ విద్వేషాలను అంతమొందించుటకు ఒకే ఒక మార్గం గలదు. అదేమనగా ప్రేమను విస్తరింపజేయుటకు మనం జిహాద్ చేయవలెను. ద్వేషాన్ని ప్రేమతో అంతమొందించవలెను. ఈ ప్రేమను అన్ని ధర్మాల వారిలో ఏర్పర్చుటకు ప్రయత్నించవలెను. ఇలాంటి ప్రేమానురాగాల ఎన్నో ఉదాహరణలు మన సమాజంలో కనిపిస్తుంటాయి. అందుకు అతి పెద్ద నిదర్శం ఈ రోజు ఇక్కడ మీరు చేపట్టుచున్న ఈ కార్యక్రమం. కాని నేడు మీడియా విధానంను చూసినచో కొందరు వ్యక్తులు చేయు కార్యకలాపాలను పదే పదే చూపి త్రప్పు ద్రోవ పట్టిస్తుంది. కావున మనము దానిని ప్రక్కకు పెట్టి పరస్పరం ప్రేమానురాగాలను పంచుకొనుటకు ప్రయత్నించాలి. ” వీరు ఎంతో ఉద్వేగం గలవారు. కార్యక్రమం తరువాత వారు నన్ను కలిసినప్పుడు ముందుగా కొంత ఉద్వేగమునకు లోనైనప్పటికి ఆ తరువాత మీ సందేశం నన్ను ఎంతగానో ప్రభావితం చేసిందని రోదించసాగెను.

న్యూజెర్సీలో సర్జికల్ కో ఆర్డినేటర్ విధులు నిర్వహిస్తున్న మరొక మహిళ అతిథురాలు షనీన్ గారిట్లనిరి. దుష్టులైన కొందరి చర్యల వలన ఆ మతమును మొత్తానికే నిందించుట ఒక దౌర్జన్యమనబడునని ఇస్లాం అందమైన బోధనల గురించి నేను కూడ అభిప్రాయపడుచున్నాను. మా అమెరికాలో ప్రతి రోజు ఏదో ఒక దుర్ఘటణ జరుగుతూనే ఉంటుంది. అందుకని వారి ధర్మము మొత్తమును తప్పు పట్టడం సమంజసం కాదు.

గత 40 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మరొక మహిళ అధికారి ఇట్లనిరి. ఈ ప్రసంగం ప్రపంచమంతటికి ఒక సందేశం. ఇందులో ప్రేమానురాగాలు, శాంతి సామరస్యాలు, అభిమానం, ఇతరుల హక్కులను గూర్చిన ప్రస్తావన గలదు. ఇక్కడ వివిధ రూపు రేఖలకు చెందిన 4 లక్షల60వేల మంది జీవిస్తున్నారు. నేటి ప్రసంగంలో అత్యంత ప్రాధాన్యమైన అంశం పొరుగు వారితో సత్ప్రవర్తనతో మెలుగడం.

పి, ఎచ్.డి పూర్తి చేసి క్రిమియాలజిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళ అతిథురాలు డాక్టర్ కింబ్రేలే గారు ఇట్లనిరి. “ నేటి ప్రసంగంలో సామరస్యత, సమన్యాయమును గూర్చి ఎంతో నిగూఢమైన సందేశమును ఆలకించు భాగ్యము లభించినది. ఎలాంటి భేదభావం లేకుండా ప్రతి ఒక్కరు ఐక్యతతో ఉండుటకు ప్రయత్నించవలెను. నేటి ప్రసంగంలో ఇస్లాం వాస్తవికతను మీరు మా ముందుంచారు. దాని సారాంశము శాంతి, సామరస్యత, సమన్యాయం, సమానత్వంను నెలకొల్పడం.” ఆ తరువాత వారు తమ అభిప్రాయమును వెల్లడిస్తూ ఉద్వేగంనకు లోనయ్యారు. నేడు దౌర్జన్యం, దుష్టత్వమును ప్రదర్శించు ప్రజలు, ధర్మము పేరుతో మన సమాజంలో అల్లరులు, అరాచకాలకు తెరతీస్తున్నారు. వాస్తవానికి వారికి ధర్మానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించినచో ఎంత బాగుండును? అని కన్నీటి పర్వంతమయ్యారు.

లోరీన్ అను ఒక మహిళ అతిథురాలు తమ అభిప్రాయములను వెల్లడించుచు ఇట్లనిరి. నేను గత 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతములోనే ఉంటున్నాను. మారుతున్న ఇక్కడి పరిస్థితులను కూడ ఎప్పటికప్పుడు పరిశీలించు చున్నాను. కొన్ని రోజుల క్రింద జరిగిన కాల్పులు ఎంతో బాధను కల్గిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రేమానురాగాలతో కూడిన ఈ సందేశం ఎంతో వైభవోపేతంగా నిలిచింది. నన్ను ఇక్కడికి ఆహ్వానించినందుకు నాకు చాలా సంతోషము కలుగుచున్నది. ఇక్కడికి వచ్చినందుకు అహ్మదియ్య ముస్లిం జమాఅత్ గురించి నాకు ఎంతో తెలిసినది. ఈ ప్రాంతములో మస్‌జిద్ నిర్మాణం అనేది అందాన్ని రెట్టింపు చేయునది. ఇది శాంతికి నియమైనందున దీనితో నాకెలాంటి ప్రమాదము లేదు. నేను ముస్లింను కాను. అయినా కూడ నన్ను ఈ మస్జిద్‌కు అహ్వానించడం జరిగింది. కావున నేను వచ్చాను. మన సమాజానికి ఇలాంటి ఆదర్శమే అవసరం. ఇకపై కూడ మీరు ఇక్కడ అనేక ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, వాటిలో కూడ ఇతర ధర్మాల వారిని ఆహ్వానిస్తారని నేను ఆశిస్తు ముగిస్తున్నాను.

ఈ మస్‌జిదుల ప్రారంభోవత్సముతో పాటు గోయిటెమాలాలో హ్యూమేనిటి ఫస్ట్ ద్వారా నిర్మించబడిన ఒక ఆసుపత్రిని ప్రారంభించామని చాలా మందికి తెలుసు. ఆ ప్రాంతీయులకు కూడ రాజకీయ నాయకులతో పరిచయం గలదు. అక్కడి ఒక మెంబర్ ఆఫ్ కాంగ్రేస్ పార్లమెంట్ సభ్యురాలు యు.కే జల్సాకు కూడ రెండు సార్లు వచ్చారు. వారు నన్ను స్వాగతించుటకు విమానశ్రయంనకు కూడ వచ్చారు. వారు ఆసుపత్రిని గూర్చి చాలా మంచి అభిప్రాయములు వెల్లడించిరి. అదే విధముగా జమాఅత్ మా దేశములో ఆసుపత్రి నిర్మించి, కమ్యునిటీలలో ప్రేమానురాగము, ఐక్యత కలిగించుటకు కృషి చేయుచున్నందున జమాఅత్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.

వైస్ మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ పీరాగోయెకు చెందినా రాబర్ట్ కీను గారు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొని ఇట్లనిరి. ఇదొక గొప్ప వేడుక. ఒకే జమాఅత్‌కు చెందిన సభ్యులు కలిసి దీనిని పూర్తి చేసినందుకు నేను ఆశ్చర్యానికి లోనైనాను. నిరుపేదలకు సహకరించుటకు, మానవుల పట్ల ప్రేమను ఆచరణాత్మక ప్రదర్శించిన విధానం ఇది. మానవ సమాజం ఈ ప్రేమ మార్గమును ఎంచుకున్నచో ప్రపంచములో శాంతి ఏర్పడును. ఇస్లాం ధర్మమును, సమాజంను అతి సమీపంగా చూచునట్టి గొప్ప అవకాశం నాకు కల్గింది. జమాఅత్ అహ్మదియ్యను గూర్చి నాలో కల్గిన ఎన్నో ప్రశ్నలకు ఇక్కడ సమాధానం దొరికింది. కొన్ని సంవత్సరాల క్రితం నుండే అహ్మదియ్య జమాఅత్ పీరాగోయెలో స్థిరపడింది. వారి ఆహ్వానం మేరకే నేను పీరాగోయె నుండి ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనుటకు ఇక్కడి వచ్చాను.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz